నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
వరంగల్-ములుగు
బుధవారం జులై 10, 2024
www.navatelangana.com

హాస్టల్‌లో మౌళిక వసతులు కల్పించాలని ఎంపీకి వినతి

నవతెలంగాణ-పర్వతగిరి



మండల కేంద్రం లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో హాస్టల్‌లో మౌళిక సదుపాయాలు కల్పించాలని పేరెంట్స్ కమిటీ సభ్యులు మంగళవారం వరంగల్ పార్లమెంట్ సభ్యులు కడియం కావ్యను, ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈసందర్భంగా వారిని శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం హాస్టల్‌లో పలు అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక చొరవ తీసుకుని పనులు త్వరిత గతిన పూర్తి అయ్యేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పర్వతగిరి పేరెంట్స్ కమిటీ సభ్యులు మహంకాల యాదగిరి, వేల్పుల కుమారస్వామి, ముజ్జిగ అనిల్ రావు, సింగారపు గోపాల్, ఆరూరి అశోక్, మాదాసి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వర్షపాతం లేక పడిపోతున్న భూగర్భ జలాలు..



ఇలాగే కొనసాగితే ప్రమాదమే..

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి :

హన్మకొండ జిల్లాలో గత జూన్, ఈ జూన్ మాసాల్లో భూగర్భ జలాలను పరిశీలిస్తే సగటున 1 మీటర్ మేరకు భూగర్భ జలాలు పడిపోయాయని భూగర్భ జల శాఖ అధికారుల నివేదిక పేర్కొంది. కొన్ని మండలాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయాయి. వేలేర్ మండలంలోని పీచరలో 10.65 మీటర్ల మేరకు భూగర్భ జలాలు పడిపోయాయి. నడికూడ మండలంలోని చర్లపల్లిలో 5.05, ఐనవోలు మండలకేంద్రంలో 6.45 మీటర్ల మేరకు భూగర్భ జలాలు పడిపోవడం గమనార్హం. ఒక్కో మండలంలో రెండు, మూడు పీజో మీటర్లు కూడా పనిచేస్తున్నాయి. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన ఫలితాలు కనిపిస్తున్నాయి. ఏదేమైనా ప్రస్తుతం సాధారణ వర్షపాతానికి అనుగుణంగానే వర్షపాతం నమోదవుతుంది. ఇంకా వర్షపాతం తగ్గితే మరింతగా భూగర్భ జలాలు పడిపోయి బావులపై ఆధారపడి సాగు చేసే రైతులకు కష్టాలు తప్పకపోవచ్చు. హన్మకొండ జిల్లాలో సరైన వర్షపాతం లేక భూగర్భ జలాలు పడిపోతున్న దుస్థితి నెలకొంది. గత ఏడాది జూన్, ఈ ఏడాది జూన్‌తో పోల్చితే జిల్లాలో సగటున భూగర్భ జలాలు 1 మీటర్ మేరకు పడిపోవడం ఆందోళన కలిగిస్తుంది. జిల్లాలోని ఒక్కో మండలంలో రెండు, మూడు కేంద్రాల్లోను పీజో మీటర్లను భూగర్భ జల శాఖ ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల్లో తీసుకున్న నివేదికల ఆధారంగా భూగర్భ జల మట్టాలను పరిశీలిస్తే జిల్లాలో సగటున సుమారు 1 మీటర్ మేరకు భూగర్భ జలాలు పడిపోయినట్లు స్పష్టమవుతుంది. ఈ జూన్ మాసంలో సాధారణ వర్షపాతంతో పోల్చితే కొంత మేరకు వర్షపాతం ఒక మోస్తారు ఎక్కువగా నమోదైనా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే గతంలో వర్షపాతం తగ్గిన నేపథ్యంలో భూగర్భ జలాలు పడిపోయినట్లు కనిపిస్తుంది.

భీమదేవరపల్లి మండలంలో వంగర గ్రామంలోని పీజోమీటర్ రికార్డులను పరిశీలిస్తే అక్కడ 4.10 మీటర్ల మేరకు భూగర్భ జలాలు పడిపోయాయి. గట్ల నర్సింగాపూర్‌లో 1.10 మీటర్లు, కొత్తపల్లిలో 0.80 మీటర్ల మేరకు మాత్రమే భూగర్భ జలాలు పడిపోయాయి. జగన్నాధపురంలో భూగర్భ జలాలు 1,7 మీటర్ల భూగర్భ జలాలు పెరిగినట్లు నివేదిక పేర్కొంది. ధర్మసాగర్ మండలంలోని ధర్మసాగర్, పెద్దపెండ్యాల, నారాయణగిరిలలో భూగర్భ జలాలు పెరిగాయి. హన్మకొండ, ఎల్కతుర్తి మండలాల్లోనూ భూగర్భ జలాలు పెరిగాయి.

ఐనవోలు, నడికూడ, వేలేర్ మండలాల్లో భారీగా పడిపోయిన భూగర్భ జలాలు

హన్మకొండ జిల్లాలోని ఐనవోలు, నడికూడ, వేలేర్ మండలాల్లో భారీగా భూగర్భ జలాలు పడిపోయాయి. ఐనవోలు మండలకేంద్రంలో 6.45 మీటర్లు, నడికూడ మండలం చర్లపల్లిలో 5.05 మీటర్లు, వేలేరు మండలం పీచరలో 10.65 మీటర్ల మేరకు భూగర్భ జలాలు పడిపోవడం గమనార్హం. ఇదే పద్ధతిలో వర్షాలు కురిస్తే రానున్న కాలంలో మరింతగా భూగర్భ జలాలు పడిపోయే ప్రమాదం లేకపోలేదు. అదే జరిగితే బావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సిన పరిస్థితి తలెత్తనుంది.

మండలం	గ్రామం	జూన్ 23 (మీటర్లలో)	జూన్ 24 (మీటర్లలో)	తేడా (మీటర్లలో)
భీమదేవరపల్లి	గట్ల నర్సింగాపూర్	6.05	7.15	-1.10
	జగన్నాధపూర్	14.85	13.78	
	కొత్తపల్లి	9.80	10.60	-0.80
	వంగర	10.80	14.70	-4.10
ధర్మసాగర్	ధర్మసాగర్	5.55	5.30	
	ధర్మసాగర్	2.40	1.50	
	పెద్దపెండ్యాల	9.85	6.80	
	నారాయణగిరి	5.4	4.7	
ఎల్కతుర్తి	ఎల్కతుర్తి	8.50	7.90	
హన్మకొండ	హన్మకొండ	6.70	5.80	
హసన్‌పర్తి	నాగారం	5.83	6.00	-0.17
	సీతంపేట	3.90	5.00	-1.10
	ఎల్లాపూర్	3.80	3.88	-0.08
ఐనవోలు	ఐనవోలు	21.05	27.50	-6.45
	పున్నేలు		5.50	5.50
	పంథిని	3.75	4.93	-1.18
కమలాపూర్	శనిగరం	2.70	4.10	-1.40
వేలేర్	పీచర	8.75	19.40	-10.65
	వేలేర్	5.6	1.18	
ఆత్మకూరు	ఆత్మకూరు	2.75	4.00	-1.25
దామెర	దామెర	4.50	4.00	
నడికూడ	చర్లపల్లి	7.85	13.90	-5.05
	నడికూడ	2.80	4.00	-1.20
పరకాల	పరకాల	4.70	6.20	-1.50
శాయంపేట	పత్తిపాక	4.12	3.70	
సగటున		**6.70**	**7.68**	**-0.98**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రధానంగా వరంగల్, హన్మకొండ నగర పరిసర ప్రాంతాల్లో కాయగూరలు, ఆకుకూరల సాగు అధికంగా జరుగుతుంది. ఖిలావరంగల్, దామెర, వరంగల్, గీసుగొండ, సంగెం, ఆత్మకూరు మండలాల్లో ఎక్కువగా కాయకూరలు పండిస్తారు. ఇక్కడ పండించే ఆకుకూరలు, కాయగూరలే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సరఫరా అవుతాయి. కాయగూరలు, ఆకుకూరల సాగుపై వాస్తవ గణాంకాలు ఉద్యాన శాఖ వద్దగాని, వ్యవసాయ శాఖ వద్దగాని సరిగ్గా లేవన్నది బహిరంగ రహస్యమే. ఉద్యాన శాఖ పరిధిలో వున్న గణాంకాలకు అదనంగా 75 శాతం సాగు జరుగుతుందన్న అంచనాలున్నాయని ఆ శాఖాధికారులు చెబుతున్నారు.

గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి





త్వరలోనే మహిళలకు మీ-సేవా, పౌల్ట్రీ, డైరీ వ్యాపారాల ఏర్పాటుకు ప్రోత్సాహం
కలెక్టరేట్ కార్యాలయ ఆవరణంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించిన మంత్రి సీతక్క

నవతెలంగాణ-ములుగు

గ్రామీణ మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, వారికి కావాల్సిన ప్రోత్సాహకాలు ప్రభుత్వం అందిస్తుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. మంగళవారం ములుగు జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు పొరిక బలరాంనాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్‌లతో కలిసి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ములుగు జిల్లాలో కలెక్టరేట్, ఏరియ ఆసుపత్రి, ఐటిడిఏ, రామప్ప దేవాలయం ఆవరణలో మొత్తం నాలుగు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నామని అందులో భాగంగా కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన జిల్లాలో మొదటి ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను ప్రారంభించామని పేర్కొన్నారు. రాష్ట్రం లో ఉన్నా మహిళలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో ఈ సంవత్సరం రూ.20 వేల కోట్ల రుణాలు బ్యాంక్ లీకేజీ ద్వారా అందించడం జరుగుతుందని, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌లను ప్రారంభించడం జరుగుతుందని నూతనమైన ఆహార పదార్థాలతో క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే మహిళలు మీ సేవ కేంద్రాలు , ఈవెంట్ మేనేజ్మెంట్, డైరీ ఫాంలు , సోలార్ లైట్స్ , అదేవిధంగా 60 లక్షల పాఠశాల ఏక రూప దుస్తులను మహిళా సంఘాల ద్వారా కుట్టించామని పేర్కొన్నారు. మహిళా శక్తి క్యాంటీన్‌లలో ఆహారం అమ్మ చేతి వంటల ఉండాలని, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. మహిళా శక్తి క్యాంటీన్లు దేశానికే ఒక బ్రాండ్‌గా నిలవాలని , స్థానిక వనరులు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మహిళా శక్తి బిజినెస్ మోడల్స్ ను త్వరలోనే రూపొందిస్తామని , రానున్న ఐదు సంవత్సరాలలో మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు అందించడంతో పాటు మీసేవ, పౌల్ట్రీ, డైరీ వ్యాపారాలు, క్యాంటీన్ల ఏర్పాటు కు అన్ని రకాల ప్రోత్సాహకాలు ప్రభుత్వం అందించడంతోపాటు వడ్డీ లేని రుణ సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, మహేందర్ జి, డిఆర్డిఓ శ్రీనివాస్ కుమార్, జిల్లా అధికారులు, ప్రియదర్శిని మహిళా పొదుపు సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని

మంత్రి సీతక్కను కలిసిన అంగన్‌వాడీలు
రిటైర్‌మెంట్స్ బెనిఫిట్స్ పెంచాలని మంత్రి సీతక్కకు వినతి
రెండు లక్షలకు ఫైల్ రెడీ అవుతుందని మంత్రి సీతక్క హామీ

65 సంవత్సరాల పైబడిన అంగన్‌వాడీటీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్ కు రూ.లక్ష, జీతంలో సగం పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం రిలే నిరాహార దీక్షలు నాలుగో రోజుకు చేరాయి. ములుగు కలెక్టర్ ఆఫీస్ కు వచ్చిన సీతక్క ను అంగన్‌వాడీలు వెళ్లి కలిసి వినతిపత్రం ఇచ్చారు.సీతక్క స్పందించి మీకు రెండు లక్షలు పెంచడానికి ఆర్థిక శాఖ దగ్గర ఫైల్ అప్రూవల్ అవుతుందనిని ఆమె తెలిపారు. కానీ కొత్త జీవో వచ్చే వరకు పాత జీఓ ప్రకారం చేస్తున్న రిటైర్మెంట్ ప్రక్రియ ను అపాలని తాజా గా జూన్ 29 న విడుదల చేసిన మెమో నెంబర్ 1334 ను ఉపసంహరించుకొని, 65 సంవత్సరాలు దాటిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకునే విధంగా ఆదేశాలు జారీ చేయాలని మంత్రి సీతక్క ను అంగన్‌వాడీలు కోరారు. అదేవిధంగా జీతంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలని కూడా అంగన్‌వాడీలు మంత్రికి విన్నవించుకున్నారు.ఆ తరువాత దీక్ష శిబిరం వద్దకు డి డబ్ల్యు ఓ స్వర్ణలత లెనినా, సీడీపీఓ లు హేమలత, ముత్తమ్మ, శిరీష వచ్చి దీక్ష విరమించాలని కోరారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మాట్లాడుతూ మెమో నంబర్ 1334 ను ఉపసంహరించుకొని 65 సంవత్సరాలు దాటిన వారిని కొత్త జీఓ వచ్చే వరకు దీక్షలు కొనసాగిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, అంగన్వాడి టీచర్లు సరోజన, సమ్మక్క, ప్రేమకుమారి, వెంకటరమణ, రామకృష్ణ, రత్న కుమారి, విజయలక్ష్మి సుశాంతల, రమాదేవి,రాజమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి
టాపర్లు గా నిలిచిన విద్యార్థులకు
సైకిళ్లను పంపిణీ చేసిన మంత్రి సీతక్క

విద్యార్థిని, విద్యార్థులు చదువుపై మక్కువ పెంచుకొని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. మంగళవారం ఇంచర్ల లోని ఎంఆర్ ఫంక్షన్ హల్ లో 2023-24 విద్యా సంవత్సరం 10వ తరగతి, ఇంటర్మీడియట్ లో టాపర్లుగా నిలిచిన 27 మంది పదవ తరగతి, 16 మంది ఇంటర్మీడియట్ విద్యార్థినిలకు మహబూబాబాద్ పార్లమెంట్ నియోజక వర్గ సభ్యులు పొరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తో కలసి రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు, సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై మక్కువ పెంచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి కృషి చేయాలన్నారు. ఇలాంటి ప్రోత్సాహకాలు విద్యార్థులకు మరింత ఉత్సాహంగా చదువులో రాణించుటకు ఉపయోగపడతాయని మంత్రి అన్నారు. ఇదే విధంగా భవిష్యత్తులో సైతం క్రమశిక్షణతో వ్యవహరించి మంచి ఫలితాలు సాధించాలని మంత్రి విద్యార్థులకు సూచించారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజక వర్గ సభ్యులు పొరిక బలరాం నాయక్ మాట్లాడుతూ ఒక కుటుంబంలో ఒక అమ్మాయిని గొప్ప చదువులు చదివించడం వల్ల ఆ కుటుంబం మొత్తం బాగుపడుతుందని తెలిపారు. ఇంటిలో మనం అన్ని అంశాలలో అబ్బాయిలను, అమ్మాయిలను ఒకే రీతిలో చూడటం ప్రారంభించాలని, బాలికలను కొన్ని రంగాలకు మాత్రమే పరిమితం చేయవద్దని, మగవారితో సమానంగా వారికి క్రీడలు మొదలగు రంగాలలో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు వారి అభిరుచుల ప్రకారం ఆశయాలను నిర్దేశించుకోవాలని, వాటి సాధన కోసం నిర్విరామంగా, క్రమశిక్షణతో కషి చేయాలని అన్నారు. మనకు నైపుణ్యం ఎంత ఉన్నప్పటికీ క్రమశిక్షణ, పట్టుదల లేకపోతే గొప్ప స్థాయికి చేరుకోలేమని, క్రమశిక్షణ పట్టుదల ఉంటే నైపుణ్యం తక్కువ ఉన్న వివిధ అంశాలను నేర్చుకొని గొప్ప స్థాయికి చేరుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, జిల్లా సైన్స్ అధికారి జయదేవ్, సంబంధిత అధికారులు, విద్యార్థినిలు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు..

చెయ్యని పనులకు అదనంగా కూలీలకు చెల్లింపు
సామాజిక తనిఖీల్లో బృందం వెల్లడి.
ఫీల్డ్ అసిస్టెంట్, ఏపీవో తీరుపై తీవ్ర విమర్శలు

నవతెలంగాణ - చెన్నారావుపేట



మండల పరిధిలో 2023 మార్చి నుండి 2024 మార్చి వరకు ఒక సంవత్సరానికి గాను ఉపాధి హామీ 30 గ్రామస్థాయి పరిధిలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. స్పెషల్ ఆడిట్ సిబ్బంది వారం రోజులపాటు గ్రామాలలో ఇంటింటి సర్వే, పని ప్రదేశంలో తనిఖీలు నిర్వహించారు. సామాజిక తనిఖీల్లో భాగంగా మంగళవారం మండల పరిధిలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో దయాకర్ అధ్యక్షతన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 15వ విడత .మండల సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిడి కౌసల్య దేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ప్రతి గ్రామంలో చేపట్టిన పనులను క్షుణ్ణంగా పరిశీలించి ఫీల్డ్ అసిస్టెంట్, ఏపీఓ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో మొత్తం జాబ్ కార్డులు ఎన్ని అందులో యాక్టివ్ గా ఉన్నాయని, ఉపాధి హామీ కూలీలకు లక్షలకు పైగా బడ్జెట్ ఆడిట్ సిబ్బంది నిర్వహించినట్లు తెలిపారు. మండలంలో మొత్తం లక్షలపై చిలుకు బడ్జెట్ పనులు కొనసాగగా కూలీలు ఎక్స్‌పెండేచర్, మెటీరియల్స్ కూలీలు చేసిన పనిని కొలతల్లో తేడాగా ఉన్నాయని సోషల్ ఆడిట్ సిబ్బంది వెల్లడించింది. సుమారు లక్షల పై చీలుకు బడ్జెట్ కూలీల పేరు మీద ఎక్కువ వెళ్లిందన్నారు. పనులు చేయకున్నా మాస్టర్లు వేసి అధిక బిల్లులు ప్రభుత్వం నుండి వసూలు చేసినట్లు సోషల్ ఆడిట్‌లో వెల్లడించారు. ఫీల్డ్ అసిస్టెంట్ కొందరికి అనుకూలమైన వ్యక్తులకు పొలం పనులు చేసే వారికి, ఇండ్లలో ఉన్న వారికి పనులకు రాకున్నా మాస్టర్ పై తప్పుడు సంతకాలు పెట్టించారని మండల సభలో బృందం వెల్లడించింది. దీంతో సైట్ మీద చేసిన పనులకు చెల్లించిన డబ్బులకు పొంతన లేకుండా తేడాలు వస్తున్నాయని సోషల్ ఆడిట్ తెలిపారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమంలో కూడా భారీగా అవకతవకలు జరిగాయని సోషల్ ఆడిట్ సిబ్బంది తెలిపారు. 25 రకాల పనులకు చెందిన ఎంపీలు ఆయా పనులకు చెందిన తీర్మానాలు చూపలేదన్నారు. ఈ విషయంపై మండల ప్రజా వేదికలో వివరాలన్ని జిల్లా అధికారుల ముందు సోషల్ ఆడిట్ సిబ్బంది వెల్లడించారు. ఇట్టి అవకతవకలపై పిడి కౌసల్య దేవి, ఫీల్డ్ అసిస్టెంట్, ఏపీవో తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఫైన్ విధించారు.ఇంటి దగ్గర ఉంటూ మాస్టర్ ల పేరు నమోదు చేసుకొని డబ్బులు తీసుకున్న వారితో ఫోన్‌లో మాట్లాడి నగదును చెల్లించవలసిందిగా కోరారు. నాలుగు రోజుల్లో పేమెంట్ లు చెల్లించకపోతే ఉద్యోగాలు ఉండవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టి ఎం సాయి జ్ఞానేశ్వర్, ఎస్ఆర్పి కొమురయ్య, విజిలెన్స్ అధికారి మాధవి, ఎంపీఓ శ్రీధర్ రాజ్, ఏపీఓ అరుణ, ఈసీ కిషోర్, టెక్నికల్ అసిస్టెంట్లు సింగ్, రాజు, మహేందర్, పంచాయతీ కార్యదర్శులు , ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు

శుభాకాంక్షలు తెలిపి సన్మానించిన
సీనియర్ నాయకులు బొల్లు రమేష్

నవతెలంగాణ -తాడ్వాయి



రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు మంగళవారం ములుగు క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తాడ్వాయి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొల్లు రమేష్ జన్మదిన వేడుకల్లో పాల్గొని మంత్రి సీతక్కకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొల్లు రమేష్ మాట్లాడుతూ పోరాటమే ఊపిరిగా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నిత్యం శ్రమించే మన మంత్రివర్యులు సీతక్క ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలని, ఇంకా ఎన్నెన్నో పెద్ద పెద్ద పదవులు స్వీకరించి, రాష్ట్రంలో, ములుగు ఏజెన్సీలో సేవలందించాలని ఆకాంక్షించారు.



గంజాయిని దగ్ధం చేసిన పోలీసులు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి :

వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో స్మగ్లర్ల వద్ద పట్టుబడిన గంజాయిని పోలీసులు దగ్ధం చేశారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో విభాగం ఆదేశాల మేరకు మంగళవారం వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న రూ.కోటీ ముప్పై లక్షల విలువైన 520 కిలోల గంజాయిని డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిపేట ప్రాంతంలో దగ్ధం చేశారు. ఈకార్యక్రమంలో ఈస్ట్‌జోన్ డిసిపి రవీందర్, అదనపు డిసిపి రవి, హన్మకొండ ఏసిపి దేవేందర్‌రెడ్డితోపాటు ఎనుమాముల ఎస్సై నర్సింహారావులు పాల్గొన్నారు.

సీపీ, కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కుడా చైర్మన్





నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి :

వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదను 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి పుష్పగుచ్ఛమిచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం వరంగల్ కలెక్టర్ కార్యాలయంలో 'ఇనుగాల' కలెక్టర్‌ను కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్, 'కుడా' చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పోలీస్ కమిషనర్‌ను కలిసిన 'కుడా' చైర్మన్

వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి పుష్పగుచ్ఛమిచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ 'ఇనుగాల'కు శుభాఆకాంక్షలు తెలిపారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

నవతెలంగాణ - పర్వతగిరి

మండలం లోని కొంకపాక లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసే కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు రానున్నారు. అలాగే మధ్యాహ్నం 2:30 గంటలకు వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు వర్ధన్నపేట, ఐనవోలు మండల పరిధిలోని కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, ఐనవోలు మండల సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొంటారని, వర్ధన్నపేట, పర్వతగిరి, మండలాల, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

శ్రీ చైతన్య పాఠశాల బోర్డును తొలగించిన విద్యాశాఖ అధికారులు



నవతెలంగాణ-పర్వతగిరి

వర్ధన్నపేట పట్టణం లోని ఓ ప్రవేట్ పాఠశాల (శ్రీ చైతన్య) పై ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించడం తో పాటు అక్రమంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని పలు ఆరోపణలు రావడం తో మంగళవారం వెంటనే విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలకు పూనుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేటు పాఠశాలలు నడపడం లేదని, సోషల్ మీడియాలో జరిగిన ప్రచారానికి జిల్లా ఉన్నతాధికారి స్పందించి మండలంలోని ఎంఈఓ రంగయ్యను స్కూల్ తనిఖీ చేయమని ఆదేశించారు. రెండు పేర్లతో కలిసి ఉన్న పాఠశాల బోర్డును తొలగించారు.ఈ సందర్భంగా ఎంఈఓ రంగయ్య మాట్లాడుతూ చైతన్య స్కూల్ పేరును తొలగించి, అరబిందో స్కూల్ అని రాసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పలుమార్లు షోకాజ్ నోటీసులు స్కూల్ యాజమాన్యానికి అందించినా తీరు మారడం లేదన్నారు. అధిక ఫీజులు, స్కూలుకు సంబంధించిన యాప్స్, పుస్తకాల అమ్మకాలు, బ్రోచర్లపై టెక్నో, ఐఐటి విద్య అందిస్తున్నామని ప్రచారం చేయడం చట్ట విరుద్ధమన్నారు. అలాంటి వాటికి ప్రత్యేకంగా పర్మిషన్ తీసుకోవాలని తెలిపారు. ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాల పుస్తకాలే వాడాలన్నారు. పాఠశాలలో నడుపుతున్న బస్సులను అరబిందో పాఠశాల పేరుతో బోర్డు రాయించుకోవాలన్నారు. ఇలాంటి కార్యకలాపాలు చేయకుంటే ప్రభుత్వ ఆదేశానుసారం స్కూలు సీజ్ చేయడం జరుగుతుందని ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు.

కళాశాల విద్యార్థినిలను సన్మానించిన మంత్రి సీతక్క

నవతెలంగాణ-మంగపేట:



ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ప్రతిభ చాటి జిల్లా టాపర్ గా నిలిచిన మండల కేంద్రంలోని ఎక్కటి సరోజిని శేషారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని షేక్ సనాను మంగళవారం రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖా మంత్రి సీతక్క సన్మాణించినట్లు కళాశాల ప్రధానాచార్యులు గూళ్ళ వెంకటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సీతక్క తన పుట్టిన రోజును పురస్కరించుకుని ఇంటర్మీడియట్ విద్యా శాఖలో 2024 వార్షిక పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన విద్యార్థినులను గుర్తించి ఇంచర్ల గ్రామంలోని ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను సన్మానించడంతో పాటు సైకిల్లను బహూకరించినట్లు వెల్లడించాడు. ఈసందర్భంగా అధ్యాపకులు రేణుకాదేవి, జ్యోతిర్మయి, సంతోష్ కుమార్, లక్ష్మణ, అనిల్ కుమార్, చిరంజీవి, రాజు, వైష్ణవి, వందన అధ్యాపకేతర సిబ్బంది దేవదాసు, శ్రీకాంత్, లక్ష్మి తమ కళాశాల విద్యార్థిని సన్మానం పొందటం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

రైతులకు రైతు భరోసా అందించాలి

నవతెలంగాణ - చెన్నారావుపేట



వర్షాకాలం ప్రారంభమైనప్పటికి ఇప్పటివరకు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా అందించలేదని అమీనాబాద్ గ్రామ రైతుబంధు కన్వీనర్ అమ్మ రాజేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కెసిఆర్ ప్రభుత్వం రైతుల పక్షాన ఆనాడు పంటల సీజన్ ప్రారంభం కాకముందే పెట్టుబడుల సాయం కింద రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమ చేసిందన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలు ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎకరానికి రూ.15 వేలు ఇస్తానని సీఎం రేవంత్ రెడ్డి మాటలు చెప్పాడే తప్ప చేతల్లో అమలు చేయలేదని వ్యతిరేకించారు. దీన్నిబట్టి చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల మీద ఎంత ప్రేమ ఉందో స్పష్టంగా అర్థమవుతుందన్నారు. రైతులపై చిత్తశుద్ధి ఉంటే సాయం కింద రైతు భరోసాను అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

నవతెలంగాణ 2
సమగ్ర తెలుగు దినపత్రిక
హనుమకొండ
బుధవారం జులై 10, 2024 www.navatelangana.com

లింగ వివక్షతను చూపవద్దు : జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ కళ్యాణి

నవతెలంగాణ-శాయంపేట



భేటీ బచావో బేటీపడావో కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లలు, మగపిల్లలు ఇద్దరినీ సమానంగా చూడాలని, లింగవివక్ష చూపవద్దని జిల్లామిషన్ కో-ఆర్డినేటర్ కళ్యాణి అన్నారు.మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్దుల సంక్షేమశాఖ, జిల్లా మహిళాసాధికారత కేంద్రం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం100 రోజుల మిషన్ శక్తి అవగాహన కార్యక్రమం ఎంపీడీవో ఫణిచంద్ర అధ్యక్షతన నిర్వహించారు. కళ్యాణి పాల్గొని బేటి బచావో బేటి పడావో పథకం, సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పించారు. ఏమైనా సమస్యలు తలెత్తితే టోల్ ఫ్రీ నెంబర్ 1098,181కు ఫిర్యాదు చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర వర్మ, సునీత రెడ్డి, మంజుల, స్వర్ణలత, మానస, పంచాయతీకార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఆశలు పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాల పట్ల అధికారులు నిర్లక్ష్యం వీడాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు టి.ఉప్పలయ్య
- కమిటీల పేరుతో కాలయాపన పట్ల ఆగ్రహం



నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

ప్రమాదంలో మృతిచెందిన మున్సిపల్ కార్మిక కుటుంబంలో ఇచ్చే ఉద్యోగం, ఆర్థిక సహాయం పట్ల అధికారుల నిర్లక్ష్యం వహించడం తగదని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు టి.ఉప్పలయ్య విమర్శించారు. మంగళవారం కాజీపేట మున్సిపల్ సర్కిల్ ఆఫీస్‌వద్ద నిర్వహించిన మున్సిపల్ కార్మికుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగాహాజరై మాట్లాడుతూ మాట్లాడుతూ గత ఏడునెలలుగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసిన మున్సిపల్ పారిశుధ్య, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు10మంది వరకు విధి నిర్వహణలో ఉండగా ప్రమాదవశాత్తు మృతిచెందారన్నారు. కార్మిక కుటుంబాలకు కార్పొరేషన్ ప్రకటించిన రూ 1.50 లక్షలు నేటికీ చెల్లించకపోవడం, ప్రమాదవశాత్తు చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వకుండా, కమిటీలపేరుతో కాలయాపన చేస్తూ చనిపోయిన మునిసిపల్ కార్మికుల కుటుంబాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్‌లో కార్మికులు పారిశుధ్య పనులు చేస్తూ విధి నిర్వహణలో మృతిచెందిన వారి కుటుంబాలకి ఉద్యోగం ఇవ్వడానికి ఎన్ని నెలల సమయం పడుతుందని ? అసలు చనిపోయిన కుటుంబానికి ఉద్యోగం ఇవ్వడానికి కమిటీ అవసరమా ? అని, ఆకమిటీ పేరుతో నెలల తరబడి నిర్లక్ష్యం వహించడం ఏంటని అధికారులను ప్రశ్నించారు. ఈ కమిటీ నిర్లక్ష్యంగా జాప్యం చేస్తుండడంతో చనిపోయిన కార్మిక కుటుంబం పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతుందన్నారు.

కార్మిక సంఘాలు అనేకసార్లు కోరిన విధంగా కమిటీని రద్దుచేసి సంబంధిత అధికారిచే ధృవీకరణ చేసి నెలరోజులలోపే కుటుంబానికి ఉద్యోగం ఇవ్వాలని, కార్పొరేషన్ ప్రకటించిన ఆర్థిక సహాయం వెంటనే అందించాలని ఉప్పలయ్య డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల విషయంలో వెంటనే ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పరిష్కారం చేయని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులందరికీ కలుపుకొని పెద్దఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

వరంగల్‌కు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షా కేంద్రం కేటాయించాలి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

అక్టోబర్ 21 నుండి ప్రారంభమయ్యే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు వరంగల్‌లో పరీక్షా కేంద్రాన్ని కేటాయించాలని ముఖ్యమంత్రికి ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేష విజ్ఞప్తి చేశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 31వేల మందికిపైగా విద్యార్థులు ఎంపిక కాగా ఒక్క హైదరాబాద్‌లోనే పరీక్షాకేంద్రం ప్రభుత్వం ఎంపిక చేయటం వలన దూర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఏడు రోజులకుపైగా హైదరాబాద్‌లోఉండి పరీక్షలు రాయడం ముఖ్యంగా మహిళలకు ఇబ్బంది కరమైన పరిస్థితులు ఏర్పడతాయన్నారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్, అదిలాబాద్ జిల్లాల విద్యార్థులకు కలిపి వరంగల్‌లో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సివిల్స్ పరీక్ష లాంటి అత్యుత్తమ పరీక్షలతో పాటు అన్ని రకాల పరీక్షలకు వరంగల్‌ని సెంటర్‌గా కేటాయిస్తున్నందున గ్రూప్-1 మెయిన్స్‌కు కూడా వరంగల్‌లో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

నవతెలంగాణ-శాయంపేట

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన రెండు లక్షల రుణమాఫీని ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని కిసాన్ మోర్చా మండల ఇంచార్జ్ పొడాల మధుకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కానుగుల నాగరాజు ఆధ్వర్యంలో డిప్యూటీ తహసిల్దార్ ప్రభావతికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్ది కిషన్‌రెడ్డి, ఉప్పు రాజు, శ్రీకాంత్, దేవరాజ్, నవీన్, చంద్రమౌళి, రాజశేఖర్, సుమన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఓబీసీ కో-ఆర్డినేటర్‌గా జ్ఞానేశ్వర్ గౌడ్

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ



వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఓబిసి కో-ఆర్డినేటర్‌గా దర్గా కాజీపేటకు చెందిన పంజల జ్ఞానేశ్వర్ గౌడ్ నియామక ఉత్తర్వుల కాపీని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఓబీసీ రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, జిల్లా అధ్యక్షులు బొమ్మతి విక్రం ముదిరాజ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ అభివృద్ధి, బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ముందుకు వెళ్తానన్నారు.

బీసీఅడ్వకేట్ శిక్షణార్థులకు ఉపకార వేతనాలు

నవతెలంగాణ-సుబేదారి

హనుమకొండ జిల్లాలోని సీనియర్ లాయర్ల దగ్గర శిక్షణలో ఉన్న బీసీ అడ్వకేట్ విద్యార్థులకు బిసి అడ్వకేట్ ఉపకార వేతనాల పథకం 2024-25గాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అదనపు కలెక్టర్ ఎ.వెంకటరెడ్డి తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకొనుటకు కనీస అర్హత అర్బన్ వారికి ఆదాయ పరిమితి రూ.2లక్షలు, గ్రామీణ ప్రాంతాలవారికీ రూ.1.50 లక్షలు ఉండాలని, తగిన విద్యార్హతలు, కులం, ఆదాయం ధృవీకరణ పత్రాలతో ఈ నెల 20 వరకు హనుమకొండ కలెక్టరేట్‌లోని బీసీసంక్షేమ కార్యాలయములో దరఖాస్తులను అందించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో నలుగురిని జిల్లాస్థాయి కమిటీ ద్వారా ఎంపికచేస్తారన్నారు. అర్హులైన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ కోరారు.

ఎంపీ డాక్టర్ కావ్యను కలిసిన నాయకులు

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



ఇటీవలే వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్యను యూత్ కాంగ్రెస్ నాయకుడు కల్లూరి పవన్, మస్తాన్, రాజులు మర్యాద పూర్వంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చైర్మన్ సాయికుమార్‌ను కలిసిన గంగపుత్ర సంఘం నేత

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



రాష్ట్ర మత్స్యపారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మెట్టు సాయికుమార్‌ను తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజేష్‌ఖన్నా గంగపుత్రుల తరపున సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో సాంప్రదాయ మత్స్యకార గంగపుత్రులకు మాత్రమే మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో సభ్యత్వాలు కల్పించేలా ప్రభుత్వం నుండి ప్రత్యేక ఉత్తర్వులకు కృషి చేయాలని కోరారు.

యోగతో సంపూర్ణ ఆరోగ్యం

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

నిత్య యోగసాధన వలన మనిషి శారీరక మానసిక రుగ్మతల నుంచి విముక్తి పొందుతాడని యోగ గురువు ఆర్.రవీంద్రచారి అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవీంద్ర చారి మాట్లాడుతూ 'దోయోగ డైలీ' శిక్షణా శిబిర నిర్వాహకులు వరంగల్, హన్మకొండ, కాజీపేట్ పట్టణ ప్రజలకోసం కేఎల్ఎన్‌రెడ్డికాలనీలోని శ్రీ రామకృష్ణ సేవా సమితి వేదికగా ఈ నెల10 నుండి ప్రతీరోజు శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్ గుజ్జుల వసంత, విద్యానికేతన్ స్కూల్ ప్రిన్సిపాల్ మహేందర్‌రెడ్డి, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు షణ్ముఖ చారిలు హాజరవుతున్నారన్నారు. వివరాలకు 9848450493 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో సత్యనారాయణరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి రవీంద్ర చారి, అంజలి దేవి తదితరులు పాల్గొన్నారు.

సాంబయ్యకు ఉద్యమ గానకోకిల పురస్కారం

నవతెలంగాణ-సుబేదారి



ఉద్యమగాయకుడు, ధూమ్ ధాం కళాకారుడు పినుమల్ల గద్దర్ సాంబయ్యకు ఉద్యమ గానకోకిల పురస్కారం ఇవ్వనున్నట్లు ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేకల చంద్రశేఖర్ యాదవ్ మంగళవారం తెలిపారు. ఈనెల 12న కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఆవిర్భావ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ నాయకులకు సన్మానం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కాగా తనను పురస్కారానికి ఎంపిక చేసిన చంద్రశేఖర్ యాదవ్‌కి, ప్రధాన కార్యదర్శి ముక్కెర సంపత్ లకు సాంబయ్య కతజ్ఞతలు తెలిపారు.

నీళ్లట్యాంక్ పైకి ఎక్కి పేదల నిరసన

- డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయించాలని డిమాండ్

నవతెలంగాణ-దేవరుప్పుల



మండల కేంద్రంలోని కొత్తవాడలో షెడ్యూల్ తెగల వారికి గత ప్రభుత్వం 20 డబుల్ బెడ్ రూమ్ లు కేటాయించగా గత మంత్రి హామీ మేరకు గ్రామ పంచాయతీ తీర్మానం ప్రకారం లబ్ధిదారులు అక్కడే నివాసం ఉంటున్నారు. ఈ సందర్భంగా అదే సామాజిక వర్గానికి చెందిన కొందరు ఫిర్యాదుల మేరకు అధికారులు ప్రభుత్వం మీకు ఇంకా అధికారికంగా డబుల్ బెడ్‌రూమ్‌ఇల్లు కేటాయించలేదంటూ ఇండ్లలో ఉన్న వారిని ఇల్లు ఖాళీ చేయాలని అధికారులు నోటీసులు అందజేశారు. దీంతో మంగళవారం ఉదయం బాధితులు దిక్కుతోచని స్థితిలో మిషన్ భగీరథ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపారు.ఉన్నఫలంగా ఇల్లు ఖాళీ చేయాలంటే మాకు చావేతప్ప మాకు వేరే మార్గం లేదని మహిళలు రోధిస్తూ విలపించారు. అధికారులు వచ్చిన్యాయం చేసే వరకు ట్యాంక్ దిగమంటు ఉప్పుల నరేష్ కుటుంబ సభ్యులు, గడ్డం నరేష్, పండు, లక్ష్మి చింత సోమేశు, చింత కిష్టయ్య, జోగు నరేష్, జోగు జానీ పిల్లలతో సహా రెండు గంటలు వాటర్‌ట్యాంక్‌పై నిరసన తెలిపారు. చివరకు హౌసింగ్ ఈఈ దామోదర్‌రావు వారికి ఫోన్ సంభాషణ ద్వారా న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ట్యాంక్ పై నుండి కిందకు దిగారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరాములు తెలుసుకొని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డితో ఫోన్ ద్వారా మాట్లాడి ఇక్కడ జరిగిన సంఘటన గురించి వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడి వారికి తప్పక న్యాయం చేస్తామని అసలైన లబ్ధిదారులకు న్యాయం జరిగే విధంగా చూస్తానని ఫోన్ సంభాషణ ద్వారా హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు వివరించారు.

వేలేరు గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్





నవతెలంగాణ-వేలేరు

మండల కేంద్రం వేలేరులోని తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాల, కళాశాలను హన్మకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం సందర్శించారు. సందర్శనలో టి ఎస్ఆర్ఈఐఎస్ ప్రిన్సిపల్ డాక్టర్ రౌత్ అజయ్‌కుమార్, ఉపాధ్యాయ, విద్యార్థి బృందం కలెక్టర్‌కి ఘన స్వాగతం పలికారు. పాఠశాల అవరణలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మొక్కలు నాటి పాఠశాలలో సదుపాయాలను పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను, అభివృద్ధి పనులపై ప్రిన్సిపాల్, విద్యాశాఖఅధికారులను వివరాలు అడిగారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించే ఉచిత,పాఠ్య,నోట్‌పుస్తకాలు యూనిఫామ్, విద్యార్థులకు అందిన విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో క్లాస్ రూమ్ లో భోధనాభ్యసన ప్రక్రియపై విద్యార్థులను ప్రశ్నించారు. విద్యార్థులు ఉచిత పాఠ్య నోట్ పుస్తకాలతో పాటు ఒక జత యూనిఫామ్ అందినట్లు, భోధనాభ్యసన ప్రక్రియ సక్రమంగా జరుగుతున్నట్లు తెలిపారు.

పాఠశాలలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేని విషయాన్ని గుర్తించి సమస్య పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వేలేరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ రాధికగుప్తా, ఇన్చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి చలపతిరావు, తాసిల్దార్ కోమి, ఎంపీడీవో లక్ష్మీ ప్రసన్న, ఎంఈవో ఎ.వెంకటేశ్వరరావు, సిఆర్పి మొగిలిచర్ల శ్రీనివాస్, జిల్లా, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్నేహాచికెన్ సెంటర్‌లో కాలంచెల్లిన గుడ్ల అమ్మకాలు

- బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి జీడబ్ల్యుఎంసీ అధికారులు
- 56 గుడ్ల ట్రేలు సీజ్... రూ.5వేలు జరిమాన







నవతెలంగాణ-హసన్‌పర్తి

మండలంలో కాలం చెల్లిన వస్తువుల అమ్మకాలు మార్కెట్‌లో రోజురోజుకు పెరిగిపోతున్నాయి. వాటిని నిలువరించాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంతో విక్రయదారులకు అలవాటుగా మారింది. దీంతో ప్రజలు కాలం చెల్లిన ఆహారవస్తువులను కొనుగోలు చేసి ప్రాణాల మీదకు తెచ్చుకుంటు న్నారని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే మండలం కేంద్రంలోని స్నేహా చికెన్ సెంటర్‌లో హసన్‌పర్తికి చెందిన ఓ విక్రయదారుడు రెండు రోజుల క్రితం కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లగా ఆ గుడ్లను వాడగా కోడి పిల్లలు మృతి చెందినట్లు గుర్తించాడు. వెంటనే బాదితుడు సంబంధిత షాపు వద్దకు వచ్చి ఆ దుకాణ అమ్మకందారుడి దృష్టికి తీసుకురాగా పట్టించుకోలేదు. దీంతో బాధితుడు కార్పొరేషన్ అధికారులకు సమాచారం అందించాడు.

దీంతో సానిటరీ ఇన్‌స్పెక్టర్ భాషానాయక్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన జవాన్‌లు బి.నాగరాజు, జి.నాగరాజు, సురేష్‌లు స్థానిక చికెన్ షాపులో తనిఖీలు నిర్వహించారు. వినియోగదారుడి ఫిర్యాదు ప్రకారం బిల్లులను పరిశీలించారు. దీంతో బిల్లులకు షాపులో స్టాకు వేసిన బిల్లుకు కొనుగోలుకు తేడా రావడంతో అవి కాలంచెల్లినవిగా గుర్తించారు. స్టాక్‌కు సంబంధించి పూర్తి ఆధారాల ప్రకారం షాపులో 56 ట్రేలు కాలం చెల్లినవిగా గుర్తించిన సానీటరి ఇన్‌స్పెక్టర్ బాషానాయక్ షాపుయజమానికి రూ.5వేల జరిమానా విధించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అభయాంజనేయస్వామి కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టాలి

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి కమిటీ అధ్యక్షులు పెరుకారి శ్రీధర్ రావు, ప్రధాన కార్యదర్శి బోయినపల్లి దేవేందర్‌రావు వినతి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

హనుమకొండ హంటర్ రోడ్డులోని అభయాంజనేయస్వామి కాలనీలో అంతర్గత సిసి రోడ్స్, సైడ్ డ్రైనేజీ, మురికి కాలువలు ప్రధాన రహదారి నుండి కాలనీకి వెళ్లే రోడ్డు వెడల్పులు చేసి అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలని అభయాంజనేయ స్వామి కాలనీ కమిటీ అధ్యక్షులు పెరుకారి శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శి బోయినపల్లి దేవేందర్‌రావులు కోరారు. అభయాంజనేయస్వామి కాలనీలో అంతర్గత సీసీ రోడ్స్, డ్రైనేజీలు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కాలనీలోని వెళ్లే దారిలో రోడ్లు గుంతల మయంగామారి వర్షపు నీరు చేరి వాహనదారులు అదుపు తప్పి రోడ్డుగుంతల్లో పడుతున్నారు. కాలనీలో ఇప్పటి వరకు డ్రైనేజీ వ్యవస్థ లేక మురికిలో చెత్తాచెదారం పేరుకుపోయి దోమలు క్రిములు కీటకాల బారినపడి ప్రజలుఅనారోగ్యాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన రహదారి నుండి కాలనీకి వెళ్లే దారిని 40 ఫీట్ల రోడ్డు వెడల్పు చేస్తామని గతంలో మున్సిపల్ అధికారులు వచ్చి మార్కింగ్ చేసి ఇప్పటివరకు పనులు ప్రారంభించలే దని కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి కాలనీ వాసులు వినతిపత్రం అందించారు.

స్పందించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వెంటనే అభివృద్ధి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా అభివృద్ధి పనులు ఆలస్యం అవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. కాలనీవాసుల సమస్యలను వెంటనే అధికారులు పనులుచేపట్టాలని ప్రధాన రహదారి నుండి కాలనీకి వెళ్లే దారిని 40ఫీట్లు వెడల్పు చేసి మున్సిపల్ అధికారులు మార్కింగ్ చేసిన విధంగానే వెంటనే రహదారి వెడల్పు చేయాలని సైడ్ డ్రైన్సు, సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని, అంతర్గత సిసి రోడ్స్ చేయించాలని కాలనీ సమస్యలను వెంటనే సమస్యలను పరిష్కరించాలని కాలనీ కమిటీ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి కోరారు.

అనుమతి లేని స్మోకింగ్ జోన్ సెంటర్‌ను వెంటనే తొలగించాలి

అభయాంజనేయ కాలనీ దేవాలయానికి అతి సమీపంలో మా ఫ్రెండ్స్ స్మోకింగ్ జోన్ అనధికారికంగా ఏర్పాటు చేశారని ఈ స్మోకింగ్ జోన్ సెంటర్లకు ప్రతీరోజు సాయంత్రం నుండి రాత్రి 11 గంటలకు అపరిచిత వ్యక్తులు వస్తూ వెళ్తున్నారు. కొన్నిసార్లు రోడ్డుపైనే బహిర్గంగా వాహనాలును ఆపి మద్యం సేవిస్తుండడంతో ముఖ్యంగా మహిళలు కాలనీలో వెళ్లే దారిలో ఈ సెంటర్ ఉండడం వలన భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. కాలనీలోని యువకులు చెడు వ్యసనాలకు గురి అయ్యే అవకాశం ఉందని ఈ విషయంపై పోలీసు అధికారులకు సమాచారం అందించడం జరిగిందన్నారు.

కావున వెంటనే మధ్యలో ఉన్న స్మోకింగ్ జోన్ సెంటర్ వెంటనే తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : సిఐ

నవతెలంగాణ-ఆత్మకూరు



మాదక ద్రవ్యాలపై ఆత్మకూరు సీఐ ఆర్ సంతోష్ మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశం ఉద్దేశించి సీఐ మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. వాటిని బారిన పడితే నూరేళ్ళ జీవితం చేడు వ్యసనాలకు బానిసై ఆగం అవుతుందని అన్నారు. ప్రమాదాలకు, హత్యలకు, దొంగతనాలకు ,దోపిడిలకు ముఖ్య కారణం మాదకద్రవ్యాలే వాటి వాడకం వల్లకలిగే దుష్ప్రభావాలు, వాటి నుండి ఎలా దూరంగా ఉండాలి అనే విషయాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉపాధ్యాయురాలు విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

కుడా చైర్మన్ ఇనగాలకు కాంగ్రెస్ నేతల సన్మానం

నవతెలంగాణ-ఆత్మకూరు



కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) నూతన చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఇనగాల వెంకట్రాంరెడ్డిని మంగళవారం ఆత్మకూరు మండలం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శాలువాతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ పరకాల ఇంచార్జీగా ఇనుగాల కాంగ్రెస్ అభివృద్ధికి చేసిన సేవలకు గుర్తింపుగా కుడా చైర్మన్‌గా పదవి బాధ్యతలు అప్పగించడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి, మంత్రివర్గానికి ఆత్మకూరు మండల కాంగ్రెస్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటి చైర్మన్ ఏరుకొండ రవీందర్, కాంగ్రెస్ మండల నాయకులు కక్కెర్ల రాజు, మార్క రజనీకర్, రాజేందర్, శ్యామెల్, నాయకులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా

నవతెలంగాణ-సుబేదారి



ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువకులకు నేడు బుధవారం ములుగు రోడ్‌లోని ప్రభుత్వ ఐటిఐ క్యాంపస్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్న ట్లు హనుమకొండ జిల్లా ఉపాధికల్పన అధికారి, ఉమ్మడి వరంగల్ జిల్లా నోడల్ అధికారి ఎం.మల్లయ్య తెలిపారు. శ్రీరామ్, అమెజాన్ రెండు కంపెనీల్లో 82 ఉద్యోగాల ఎంపికకు జాబ్ మేలా నిర్వహించబడును. ఎస్ఎస్‌సి, ఆ పైనా చదివిన 18 ఏళ్ల నుండి 35 ఏళ్లలోపు నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులు అన్నారు. ఎంపికైన వారు వరంగల్ లో పని చేయాల్సి ఉంటుందని, జీతం రూ.18 వేలు పైనా పొందుతారన్నారు.

అర్హత ఆసక్తి గల యువతి యువకులు విద్యార్హతల సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపిలతో జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఉదయం 11గంటలకు జరుగు జాబ్ మేళాకు హాజరు కావాలని మరిన్ని వివరాలకు నెంబర్ 98488 95937 లో సంప్రదించాలని ఆయన కోరారు.

యుద్ధాలు మానవ మనుగడకు ప్రమాదకరం

నవతెలంగాణ-సుబేదారి

యుద్ధాలు మానవాళి మనుగడకు ప్రమాదకరం, సామ్రాజ్యవాద యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమాలు ఉధతం కావాలని ఎంసీపీఐ (యు) జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మద్ది కాయల అశోక్ ఓంకార్ అన్నారు. సుబేదారిలో పెద్దారపు రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి అశోక్ ఓంకార్ ముఖ్య అతిథిగా హాజరై అశోక్ ఓంకార్ మాట్లాడుతూ యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు నిర్మాణం చేయటమే ఏకైక మార్గం అన్నారు. ఈ పరిస్థితుల్లో దేశం, రాష్ట్రంలో ఉన్న ప్రజల భౌతిక పరిస్థితిని అధ్యయనం చేసి సంస్కృతి, సాంప్రదాయ ఆచార వ్యవహారాలు పరిరక్షణకు ఎంసిపిఐ (యు) శ్రేణులు ప్రజా ఉద్యమాలు నిర్మాణం చేయటం ద్వారా ప్రజా హక్కుల పరిరక్షణ చేయాలని వర్గ, సామాజిక సమస్యలపై సమగ్ర అధ్యయనం పోరాటం ద్వారా ప్రజా ప్రత్యామ్నాయం నిర్మాణం చేద్దాం అని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గాదగోని రవి, గడ్డం నాగార్జున, కుంభం సుకన్య, వస్కుల మట్టయ్య, వనం సుధాకర్, గోనె కుమారస్వామి, హంసారెడ్డి, రవి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ పట్టణంలోని లష్కర్ బజార్లో ప్రాక్టీసింగ్ స్కూల్, ప్రైమరీ స్కూల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేష్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు సమస్యలతో సతమాతమవుతున్నారన్నారు. పాఠశాలలలో తాగు నీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, డైనింగ్‌హాలు, ఆట వస్తువులు, లైబ్రరీ, ల్యాబ్, స్కావెంజర్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాఅధికారులు అన్ని ప్రభుత్వ పాఠశాలలు సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి సమస్యల పరిష్కారం కొరకు కృషి చేయాలని కోరారు. అలాగే పాఠశాలల్లో పూర్తిస్థాయి టీచర్లు లేక ఇబ్బందులు పడుతు న్నారన్నారు. కొన్నిచోట్ల ఇన్చార్జి హెచ్‌ఎంలు ఉండటం వలన విద్యార్థులకు అందుబాటులో ఉండలేకపోతున్నా రని కావున తక్షణమే ప్రభుత్వం చొరవ చూపి రెగ్యులర్ హెచ్‌ఎం లను నియమించాలని, రెగ్యులర్ ఎంఈఓలను కూడా నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో టౌన్ సెక్రట రీ బాలగోని రాకేష్, జిల్లా నాయ కులు రాజేష్, రాకేష్, శివ పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు రైతుసమస్యలపై వినతిపత్రం

నవతెలంగాణ-దామెర

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ బిజెపి నాయకులు గురజాల శ్రీరామ్‌రెడ్డి, పావు డాల మధుకర్, మాదారపు రతన్, గంకిడి బుచ్చిరెడ్డి, రాజ్ కుమార్, రమేష్, కొమురయ్యలు తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2 లక్షల రు ణమాఫీ, ప్రతి ఎకరాకు రూ.15 వేల రైతు భరోసా, కౌలు రైతులకు సైతం ఇస్తామని సీఎం వాగ్దానం చేశారని వ్యవసాయ కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారము సంవత్సరానికి 12 వేల రూపాయలు అమలు చేయాలని ప్రధానమంత్రి పంటల బీమా యోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
జయశంకర్ భూపాలపల్లి
బుధవారం జులై 10, 2024 www.navatelangana.com

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

మొక్కలను సంరక్షించాలి : ఎమ్మెల్యే జీఎస్సార్



నవతెలంగాణ-భూపాలపల్లి

విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జయశంకర్ ఎకో పార్కులో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్ర మంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎస్పి కిరణ్ ఖరేతో పాటు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న రహదారుల వెంబడి, ఖాళీ ప్రదేశాలలోను, అన్ని ప్రభుత్వ కార్యా లయాల ఆవరణలోను, పాఠశాలల్లోను మొక్కలు నాటాలని అధికా రులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ... కాలుష్య నివారణకు ప్రతి ఇంటి ఆవరణలో కనీసం మూడు నుండి ఐదు మొక్కలు తప్పకుండా నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని అన్నారు. అనంతరం ఎస్పి కిరణ్ ఖరే మాట్లాడుతూ.. మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అనానరు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సీసీఎఫ్ ప్రభాకర్, డీఎఫ్ఓ వసంత, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, అటవీశాఖ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

నాగ్‌పూర్ బైపార్టైడ్ వర్క్‌షాప్

హాజరైన భూపాలపల్లి డెలిగేట్స్



నవతెలంగాణ -కోల్‌బెల్ట్

నాగ్‌పూర్ సెంట్రల్ హాల్‌లో ఈనెల 8న జరిగిన ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ(బైపార్టైడ్) వర్క్ షాప్‌కు కోల్ ఇండియా నుండి డిజిఎంఎస్ అధికారులు, గుర్తింపు , ప్రాతినిధ్య సంఘం నుండి ఇద్దరు ప్రతినిధులు హాజరయ్యారు. అందులో భూపాలపల్లి ఏరియా నుండి ఆసిఫ్ పాషా- హెడ్ ఓవర్ మెన్ (కేటికె- 5) - ఏఐటీయూసీ పాల్గొన్నారని భూపాల పల్లి ఏరియా అధికార ప్రతినిధి అజ్మీర తుకారం మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ సభలో ముఖ్యంగా రక్షణ, వృత్తిపరంగా వచ్చే వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యూనియన్ నాయకుల సలహాలు తీసుకున్నట్టు చెప్పారు. హెవీ మిషనరీ వాడకం వల్ల జరిగే ప్రమాదాలు, భవిష్యత్తులో జరగకుండా తీసు కోవాల్సిన జాగ్రత్తలపై అవగాహనకల్పించారని అన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు సిఈఆర్ క్లబ్ ఏర్పాటు చేయాలని, గృహ సదుపాయం కల్పించాలని, తదితర సమస్యల పరిష్కారానికి సూచనలిచ్చారని అన్నారు.

'నేడు కోరికల దినం నిరసన కార్యక్రమం'



నవతెలంగాణ - భూపాలపల్లి టౌన్

నేడు దేశవ్యాప్తంగా జరిగే కోరికల దినం నిరసన కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్రంలోని ఆశవర్కర్లు అందరూ పాల్గొంటారని సీఐటీయూ జిల్లా నాయకులు ఆకుదారి రమేష్, ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి మెట్టు కొండ లక్ష్మి అన్నారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారికి, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారికి వేరువేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నేడు కోరికల దినంగా పాటిస్తున్నట్టు తెలిపారు. ఎన్‌హెచ్‌ఎం స్కీంలో గిరిజన ప్రాంతంలో 33 సంవత్సరాలు, మైదాన ప్రాంతంలో 19 సంవత్సరాల నుండి ఆశలు పని చేస్తున్నారని అన్నారు. వారి సమస్యలు పరిష్కరించకుండా కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. ఇప్పటికైనా ఆశాల సమస్యలు పరిష్కరించి వారి న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూజిల్లా నాయకులు రాజేందర్, ఆశ వర్కర్లు స్రవంతి కవిత, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత యాదవ సంఘం మహా సభ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-మహాదేవపూర్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్ మండలం కన్నెపెల్లి గ్రామంలో మంగళవారం అఖిల భారత యాదవ సంఘం మహా సభ కమిటీ ఎన్నిక కాటారం డివిజన్ అధ్యక్షులు స్వామి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా మొగిలి మధుకర్ యాదవ్, అధ్యక్షులుగా దాసరి దేవేందర్‌యాదవ్ యాదవ్, ఉపాధ్యక్షులుగా ఈర్ల శేఖర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మొగిలి శ్రీధర్‌యాదవ్ కార్యదర్శిగా సాల్పాలా సంతోష్‌యాదవ్, కోశాధికారిగా దాసరి కుమార్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా ఆత్మకూరి స్వామి యాదవ్, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ నాయకులు మొగిలి రాజ్ కుమార్ యాదవ్, మహాదేవపూర్ మండల నాయకులు కాటవేణి రాజయ్య యాదవ్, పిడుగు బాపు యాదవ్, అప్పల బూమేష్ యాదవ్ కోడెపాక మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు. స్వామి యాదవ్ మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో యాదవులు ఐక్యంగా ఉండి రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు.

జాతీయ విద్యార్థి దినోత్సవం

నవతెలంగాణ-మహాదేవపూర్

మండల కేంద్రంలో మంగళవారం ఏబీవీపీ మహాదేవపూర్ మండలశాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యార్థి దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. నగర కార్యదర్శి పేట సాయి మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఏబీవీపీ అవతరించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయంలో శ్రీపాధరావు విగ్రహం ఏర్పాటు సరికాదు : బీఆర్ఎస్

నవతెలంగాణ-మహాదేవపూర్

ప్రభుత్వ కార్యాలయంలో విగ్రహం ఏర్పాటు చేయడం సరికాదని, అనుమతి ఇచ్చిన ఎంపీడీఓపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నాయకులు మోహన్ రెడ్డి, అలీ ఖాన్ మంగళవారం ప్రకటనలో కోరారు. మండలంలో ప్రజాధనంతో నిర్మించిన మండల పరిషత్ కార్యాలయంలో దుద్దిల్ల శ్రీపాదరావు విగ్రహం ఆవిష్కరించడాన్ని కండిస్తున్నామన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అనుసరించి పరిపాలన జరుగుతున్నదన్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే బాగుండేదని అన్నారు. ప్రజాభిప్రాయం తీసుకోకుండా విగ్రహ ఏర్పాటును ఇతర పార్టీల వారు వ్యతిరేకిస్తున్నా తీర్మాణం ఉందన్న నెపంతో విగ్రహ ఏర్పాటుకు ఎంపీడీవో అనుమతులివ్వడం ఏంటని ప్రశ్నించారు. స్వార్థ రాజకీయాల కోసం ఇలాంటి పనులకు పూనుకోవడం సిగ్గు చేటని అన్నారు.

పేదోళ్లకు అందిస్తేనే ఉపయోగం

- విధులలో అలసత్వం వహిస్తే సహించేది లేదు
- అధికారుల తీరు పై ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ ఆగ్రహం
- పనుల్లో వేగం పెంచాలి : జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ
- భూపాలపల్లి నియోజకవర్గంలో చేపట్టిన పనులు, పనుల పురోగతిపై సమీక్ష





నవతెలంగాణ-భూపాలపల్లి

అభివృద్ధి, సంక్షేమ పథకాలు పేదోళ్లకు అందిస్తేనే ఉపయోగం ఉంటుందని, తద్వారా ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కొందరు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాల్‌లో భూపాలపల్లి ని యోజకవర్గస్థాయిలో చేపట్టిన పనులు, పురోగతి, ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్న భవనాలు, నిధులు మంజూరు తదితర అంశాలు మౌలిక సదుపాయాలు కల్పన, శాఖాపరమైన అనుమతులు, నిధుల మంజూరుకు ప్రతి పాదనలపై అన్ని శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ... ప్రజల సొమ్ము దుర్వినియోగం కాకుండా చూడాల్సిన భాద్యత అందరిపై ఉందన్నారు. పనులు చేపట్టకుండా చెల్లించిన ప్రభుత్వ సొమ్మును రికవరీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గస్థాయి పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నిధుల కొరత లేదని, నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. గత సంవత్సరం వరదల కారణంగా 124 చెరువులు దెబ్బతిని పంట సాగుకు అనుకూలత లేకుండా పోయిందని అన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరు చేసారని ప్రాధా న్యత ప్రకారం పనులు పూర్తి చేయాలన్నారు. టెండర్ దక్కించుకుని పనులు చేపట్టని కాంట్రాక్టర్లకు నోటీస్ జారీ చేసి రద్దు చేయడంతో పాటు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బుద్దారం నుండి కోడవటంచ వరకు రహదారి నిర్మాణానికి రూ.59 కోట్లు, కోటంచ దేవాలయం అభివృద్ధికి రూ.12 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వచ్చే నెల 9న మళ్ళీ సమీక్షిస్తామని, ప్రగతి కనపడాలని ఆదేశించారు. టేకుమట్ల రాఘవరెడ్డిపేట మధ్య మానేరు వాగుపై నిర్మిస్తున్న వంతెనను 20 రోజుల్లోగా పూర్తి చేయాలని అన్నారు. రామప్ప చెరువు నుండి వంగపల్లి చెరువు మీదుగా గణప సముద్రం చెరువులోకి నీటి సరఫరాకు గ్రావిటీ కెనాల్ నిర్మాణానికి భూ సేకరణ చేపట్టాలని అన్నారు. నియోజక వర్గం లోని 500 ఎకరాలకు పైబడి సాగయ్యే చెరువులకు తైబందీ చేయాలని అన్నారు. రైతులకు రైతు బీమా రెన్యువల్ పట్ల అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేయించాలని, మిషన్ భగీరథ నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. పైపు లైన్ల లీకేజిలను అరికట్టాలని అన్నారు. ఒడితల, నవాబుపేట, ధర్మారావుపేట, మంజూరునగర్‌లో నూతన సబ్ స్టేషన్‌ల నిర్మాణానికి స్థల సేకరణ చేయాలని ఆదేశించారు. ఇరిగేషన్ ఎస్ఈ సమావేశానికి హాజరు కాకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. నిరుపయోగంగా ఉన్న కుట్టు మిషన్లు పంపిణీకి అర్హుల జాబితా తయారు చేయాలని అన్నారు. సింగరేణి సిఎస్ఆర్ నిధులు రూ.4 కోట్లు మంజూరు చేస్తే పనులు ప్రారంభించకుండానే రూ.కోటి20 లక్షలు నిధులు చెల్లించారనిచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. నిర్దేశిత సమయానికి పెండింగ్ పనులు పూర్తి చేసి నివేదిక అందించాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి, ఇరిగేషన్, వైద్య, విద్యా, పంచాయతీరాజ్, ఎస్సీ కార్పోరేషన్, బీసీ సంక్షేమ, తదితర అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రయివేట్ ఎలక్ట్రీషియన్ మృతి.. అనుమానాలెన్నో !

నవతెలంగాణ-గణపురం



మృతుడు రాజిరెడ్డి(ఫైల్ ఫొటో)

గణపురం మండలం లక్ష్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ప్రవేట్ ఎలక్ట్రీషియన్ రెడ్డి రాజిరెడ్డి(42) చికిత్స పొందుతూ హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో మంగళవారం సాయంత్రం మృతిచెందాడు. ఐదు రోజుల కిందట రాజిరెడ్డి విద్యుత్ స్తంభం ఎక్కి పనులు చేస్తుండగా విద్యుత్‌షాక్‌తో స్తంబంపై నుంచి కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి అక్కడి నుండి హైదరాబాద్ లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ రాజిరెడ్డి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య కార్తిక, కూతురు, కొడుకు ఉండగా కుమారుడు మూగవాడు. కాగా ఎల్సీ తీసుకున్నా విద్యుత్ ప్రమాదాలు జరుగుతుండటంపై ప్రయివేట్ ఎలక్ట్రీషియన్లు బెంబేలెత్తుతున్నారు. లక్ష్మారెడ్డిపల్లి గ్రామంలో లైన్‌మెన్‌కు రాజిరెడ్డి సమాచారం ఇచ్చి ఎల్‌సి తీసుకున్నాడు. ఇదే నమ్మకంతో రాజిరెడ్డి పనులు చేస్తుండగా లైన్‌మెన్ ఒక ఫీడర్‌కు ఇవ్వాల్సిన కరెంటు మరో ఫీడర్‌కు ఇవ్వడంతో పోల్ మీద ఉన్న రాజిరెడ్డి విద్యుద్ఘాతానికి గురయ్యాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాగా, విద్యుత్తు స్తంభాలపై నుండి పడి చాలామంది ప్రైవేట్ ఎలక్ట్రీషన్లు గాయాల పాలవుతున్నారు. గణపురంలో ఒక ప్రైవేట్ ఎలక్ట్రీషన్ రెండుసార్లు గాయాల పాలయ్యాడు. ఇలాంటి సంఘటనలు మండలంలో చాలా జరుగుతున్నాయి. కావాలని చేస్తున్నారా ? అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విచారణ చేపడతాం : ఏఈ వెంకటరమణ

రాజు రెడ్డి మృతిపై విచారణ చేపడతాం. ఎల్ సి తీసుకున్నప్పటికీ విద్యుత్ సరఫరా ఎలా జరిగిందో క్షుణ్ణంగా పరిశీలించి, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటాం.

ప్రభుత్వ పథకాలు ప్రకటనలకే పరిమితం : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-చిట్యాల

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రకటనలకే పరిమితమయ్యాయని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు శ్రీకాంత్, దేవేందర్ అన్నారు. మంగళవారం సీపీఐ (ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో మొగుళ్ళపల్లి టేకుమట్ల, రేగొండ, చిట్యాల నాలుగు మండలాలకు సంబంధించిన రాజకీయ శిక్షణ తరగతులను రెండో రోజు మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో నిర్వహించారు. మండల కార్యదర్శి చింతల రజనీకాంత్, భూక్యా నవీన్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. జిల్లా కమిటీ సభ్యులు ఆత్మారి శ్రీకాంత్, గుర్రం దేవేందర్ హాజరై పార్టీ విశిష్టత నిర్మాణం గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత విద్య, ఆరోగ్యం అందరికి అందడం లేదన్నారు. ప్రయివేటు పాఠశాలు, ఆస్పత్రుల్లో పేదలను దోపిడీ చేస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. రాబోయే కాలంలో సోషలిజం తీసుకురావడానికి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల కార్యకర్తలు మూసాపూరి కల్పన, కుమార్, సమ్మయ్య పాల్గొన్నారు.



ప్రజా ఆరోగ్యంపై పట్టింపేదీ ?

అంబేడ్కర్ స్టేడియంలో అన్నీ అసౌకర్యాలే..

- కుక్కల స్వైర విహారం, కోతుల బెడద
- భయాందోళనలో వాకర్స్ క్రీడాకారులకు తప్పని ఇక్కట్లు



నవతెలంగాణ-భూపాలపల్లి

జయశంకర్-భూపాలపల్లి జిల్లాలోనే ఏకైక, అతిపెద్ద క్రీడామైదానం అంబేద్కర్ స్టేడియం. కానీ, మైదానం ఏండ్ల తరబడిగా సమస్యలతో కొట్టు మిట్టాడుతోంది. ఎక్కడ చూసినా సౌకర్యాలు కానరావట్లేదు. స్టేడియం అభివృద్ధిపై సింగరేణి యాజమాన్యం దృష్టి సారించని పరిస్థితి. దీంతో పిచ్చిమొక్కలతో మైదానం నిండిపోయి కుక్కలు, కోతుల బెడదతో వాకర్స్ భయాందోళనకు గురవు తున్నారు. మరోవైపు రాత్రి వేళల్లో జల్సాలకు అడ్డాగా మారింది. దీంతో క్రీడా కారులు ఇబ్బందులు పడుతున్నారు.







జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ క్రీడామైదా నానికి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం కార్మికులు, వారి కు టుంబ సభ్యులు, పట్టణ ప్రజలు, మహి ళలు, పోలీస్ కాని స్టేబుల్, శిక్షణకు వాకింగ్, జాకింగ్, వ్యాయామం చేసేందుకు వస్తుంటారు. సింగరేణి కార్మికులతో జిల్లాలోని వివిధ క్రీడా అసోసియేషన్లు, పాఠశాలు, కళాశాలలు, ఇతరసంస్థలు, ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో క్రీడలు నిర్వ హించడానికి ఇదొక్కటే ప్రధాన కేంద్రం. ప్రస్తుతం స్టేడియాన్ని అధికారులు పట్టించుకోక పోవడంతో సమస్య లతో కొట్టుమిట్టాడుతోంది. స్టేడియంలోని మరుగుదొడ్లకు నిత్యం తాళాలు వేసి ఉండడంతో నిరుపయోగంగా మారాయి. ఈ మధ్యకాలంలో మైదానం రెండు వైపులా తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మిం చినప్పటికీ నీటి సౌకర్యం కల్పించలేదు. దీంతో వ్యాయామ, వాకర్స్, క్రీడాకారులు, మహిళలు ఇబ్బంది పడుతున్నారు.

వాకింగ్ ట్రాక్‌కు ఇరువైపులా టెన్నిస్, హాండ్‌బాల్, వ్యాయామంచేసే ప్రాంతాల్లో పిచ్చి చెట్లు పెరగడంతో విష కీటకాల సంచారం ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు సాయంత్రం చీకటి పడగానే మందు బాబులకు అడ్డాగా మారుతోంది. మైదానంలో బీర్లు, మద్యం బాటిళ్లు వాకింగ్ ట్రాక్ చెట్ల కింద దర్శనమిస్తున్నాయని పలువురు వాకర్స్ వాపోతున్నారు.

పర్యవేక్షణ కరువు...

సింగరేణి ఆస్తులను కాపాడేందుకు పర్యవేక్షణ కరువైంది. సింగరేణికి చెందిన ప్రాధాన్యత కలిగిన భవనాలు, స్థలాలపై సింగరేణి సెక్యూరిటీ విభాగం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తుంది. కానీ, అంబేడ్కర్ స్టేడియం, సీఈఆర్ క్లబ్ పర్యవేక్షణకు యాజమాన్యం ఎటువంటి సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయడం లేదు. దీంతో ఆకతాయిలు, మద్యంప్రియులకు ఇండోర్ స్టేడియం అడ్డాగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



అంబేద్కర్ స్టేడియంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి. తెల్లవారుజామున వాకింగ్ రావాలం ఇబ్బందిగా ఉంది. స్టేడియంలో పిచ్చిమొక్కలు విపరీతంగా మొలిచాయి. మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలి. రాత్రివేళలో సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటుచేయాలి. మద్యం సీసాలు పగిలి కాళ్లకు కుచ్చుకుపోయే ప్రమాదం ఉంది. కోతుల కుక్కల బెడద నివారించాలి.సింగరేణి యాజమాన్యం దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలి.

-మంద జోవర్ధన్, వాకర్, భూపాలపల్లి



పంచభూతాలు ఎంతో ముఖ్యం

భూపాలపల్లి ఏరియా జీఎం హబీబ్ హుస్సేన్‌ఓ

నవతెలంగాణ -కోల్‌బెల్ట్

మానవ మనుగడకు పంచభూతాలైన గాలి, నీరు, నిప్పు, భూమి, ఆకాశం ఎంతో ముఖ్యమని భూపాలపల్లి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ సయ్యద్ హబీబ్ హుసేన్ అన్నారు. మంగళవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏరియా ఎన్విరాన్మెంటల్ అధికారి పోషమల్లు ఆధ్వర్యంలో భూపాల పల్లి జిల్లా కేంద్రంలోని జీఎం కార్యాలయం ఆవరణలో హుస్సేన్ నార సంచుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని నిషేధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఎస్‌జోతి, డీజీఎం(పర్సనల్) అజ్మీర తుకారాం, ఎస్ఈ(పర్చేస్) బి శ్రీనివాస్, డివై పిఎంలు రాజు, క్రాంతి, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'చల్ల తిరుపతిరెడ్డి'కి సన్మానం



నవతెలంగాణ-మహాదేవపూర్


మహాదేవపూర్ పీఏసీఎస్‌కు ఎన్‌సిడిసి-2023 ఎక్సలెన్స్ అవార్డు వచ్చిన విషయం విధితమే. ఈక్రమంలో మంగళవారం మహాదేవపూర్ పీఏసీఎస్ చైర్మెన్ చల్ల తిరుపతిరెడ్డిని కరీంనగర్ కేడీసీసీ, నాఫ్కాబ్ బ్యాంక్ చైర్మెన్ కొండూరి రవీందర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. కరీంనగర్ లోని తన కార్యాలయంలో చల్ల తిరుపతిరెడ్డిని సన్మానించారు. సంఘం అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని రవీందర్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ పీఏసీఎస్ డైరెక్టర్ దాసరి సమ్మయ్య ఉన్నారు.

పలుగుల గ్రామంలో ఉచిత కంటి పరీక్షలు

నవతెలంగాణ-మహాదేవపూర్

మహాదేవపూర్ మండలంలోని అమృత వర్షిని అక్షర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పలుగుల గ్రామంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సుమారు 60 మందికి కంటి పరీక్షలు చేశామని, అందులో 25 మందికి కంటి ఆపరేషన్లు అవసరం ఉందన్నారు. వారికి త్వరలో తమ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సమ్మయ్య డిప్లమాప్తాల్ అసిస్టెంట్ దినేష్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-చిట్యాల

చల్లగరిగ నుంచి కోటంచ లింకు రోడ్డు వరకు రూ.కోటి70 లక్షలతో బీటీ రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. కొంతకాలంగా చల్లగరిగ నుంచి కోటంచ వెళ్లే రోడ్డు దెబ్బతిని ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకుని ఎమ్మెల్యే స్పందించి నిధులు మంజూరు చేయించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముఖిరాల మధువంశీకృష్ణ, కార్యదర్శి చిలుకల రాయకొముురు, యూత్ నాయకులు బొజ్జం వేణు, దేవేందర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
జనగామ
బుధవారం జులై 10, 2024 www.navatelangana.com

గౌరవెల్లి కాలువతో పంటలకు సాగు నీరందించాలి

- ప్రాజెక్టు కాల్వను పరిశీలించిన సీపీఎం బృందం



నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

గౌరవెల్లి కాలువ పనులు వెంటనే పూర్తిచేసి రైతుల పంటలకు సాగు నీరందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు అన్నారు. మంగళవారం క్రిష్టాజిగూడెంలో సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో గౌరవెల్లి ప్రాజెక్టు కాలువను సందర్శించారు. ఈ సందర్భంగా రాపర్తి రాజు మాట్లాడుతూ 20ఏండ్ల క్రితం నాటికాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో గౌరవెల్లి ప్రాజెక్టు వరదకాలువ ద్వారా మండలంలోని సుమారు 10 గ్రామాలకు సాగు నీరు అందించడానికి రైతుల వద్ద భూసేకరణ చేసి, కోట్లాది రూపాయలు వెచ్చించి కాల్వపనులు చేశారన్నారు. ఈ పనులు కూడా అక్కడక్కడ అసంపూర్తిగా వదిలేశారని, 20ఏళ్ల క్రితం తీసిన కాలువల్లో ముళ్ళపొదలు పెరిగి, కాలువ కూరుకుపోతుందన్నారు. వ్యవసాయభూముల వద్దకు వెళ్లేదారుల్లో కాలువపై, కల్వర్టు బ్రిడ్జిల నిర్మాణం చేపట్టకుండా వదిలేయడంతో, కాలువ అవతలికి వెళ్లే రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతు సంక్షేమమే లక్ష్యమని చెప్పుకుంటున్నా ప్రభుత్వాలు 20 ఏళ్ళు గడిచిన సాగునీరు ఎందుకు అందించలేదని ప్రశ్నించారు. కేవలం కాంట్రాక్టర్ల జేబులు నింపడానికి కాలువలు తవ్వి వదిలేసారని విమర్శించారు.

ఇప్పటికైనా రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది కాబట్టి అసంపూర్తిగా ఉన్న గౌరవెల్లి ప్రాజెక్టు పనులను సత్వరమే పూర్తి చేసి రైతుల పంట పొలాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులను సమీకరించి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి సాదంరమేష్, సాదం పరమేష్, పోలు సంపత్, గద్ద కుమార్, సాదం రాజు, నారబోయిన బిక్షపతి, సాదం రామరాజు, ముడిక సాయిలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలి

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్



విద్యార్థుల భవిష్యత్తును ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్ఎంల సమావేశం మండలనోడల్ అధికారి కొమురయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎంతో బాధ్యతగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను భవిష్యత్తును తీర్చిదిద్దాలన్నారు. ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి, ఉత్తమ పౌరులుగా మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో జిసిడిఓ గౌసియా బేగం, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మిసరగండ్ల సంపత్, కుసుమ రమేష్, రఘు, మండల పరిధిలోని హెచ్ఎంలు, ఎంఆర్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్



మండలంలోని నమిలిగొండకు చెందిన పెద్దపూండ్ర శ్రీనివాస రెడ్డి, స్వాతిల కుమార్తె పెద్దపూండ్ర రితీష (16) చికిత్సపొందుతూ మంగళవారం మరణించింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మాచర్ల గణేష్, నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఆకుల కుమార్, సంపత్ రెడ్డి, హరిక్రిష్ణ, గాదె రాజు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన నరేష్‌కుమార్

నవతెలంగాణ-బచ్చన్నపేట



తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క జన్మదినం సందర్భంగా వాస్విక్ ఫౌండేషన్ ఛైర్మన్ నిడిగొండ నరేష్‌కుమార్ వారి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ వాస్విక్ ఫౌండేషన్ ద్వారా సేవే లక్ష్యంగా ప్రేమే మార్గంగా చేసుకొని అనతికాలంలోనే రాష్ట్రం నలుమూలల అనేకరకాలుగా అవసరం ఉన్నచోట క్షేత్రస్థాయిలో నరేష్ సేవలందిస్తున్నారని కొనియాడుతూ వాస్విక్ ఫౌండేషన్ బృందానికి అభినందనలు తెలుపుతూ శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందించి మీరు ఇలాగే అలుపెరుగక ముందుకు కొనసాగాలని ఆశీర్వదించారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం

నవతెలంగాణ-బచ్చన్నపేట

ప్రతి ప్రభుత్వఉద్యోగిఉద్యోగరీత్యా బదిలీపైవెళ్లడం సహజమని ఎంపీపీఎస్ హెచ్ఎం వై.కృష్ణంరాజు అన్నారు. మంగళవారం బచ్చన్నపేట మండలంలోని కొన్నే ప్రభుత్వ పాఠశాల నుండి బదిలీపై వెళ్లిన ఎం.అంబదాసు, జి.శ్రీనివాస్‌లను నూతనంగా వచ్చిన వై.కృష్ణంరాజు, టి.నాగరాజులను అమ్మఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.నాగరాజు, జె.నాగరాజు,ఏఐపిసి ఛైర్మన్ చెవుల బాలరాజు, వైస్ ఛైర్మన్ పసుల కనకరాజు, తాడిచెట్టు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-స్టేషన్ ఘనపూర్

మండలంలో చాగల్ గ్రామంలో మట్టెవాడ లక్ష్మీ ప్రసన్న మరణించగా మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షులు పోగుల సారంగపాణి నాయకులతో కలిసి మంగళవారం పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, భర్త సురేష్ కు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చేపూరి కుమార్, చేపూరి ప్రభాకర్, ఐలపాక శ్రీనివాస్, బాస్కుల విక్రమ్, మహేష్, పొన్నరాజేష్, గణేష్, రాకేష్, విజయ్,అనిల్, రామచంద్రంలు పాల్గొన్నారు.

పాఠశాలకు ఎలక్ట్రానిక్ బెల్ అందజేత

నవతెలంగాణ-బచ్చన్నపేట



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు దాతలు అండగా నిలవాలని పాఠశాల పూర్వ విద్యార్థి ప్రభుత్వ ఉపాధ్యాయుడు గొట్టె కనకయ్య అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్ఎస్‌కు రూ.10వేల విలువ గల ఎలక్ట్రానిక్ బెల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వెంకటరెడ్డి ఉపాధ్యాయులు రామచంద్రం, పృథ్వీరాజ్, యాదగిరి, బాలరాజు, నర్సిహ్మారెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అష్టదళ పాద పద్మారాధన

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్



చిల్పూర్ మండలం బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం భక్తి శ్రద్ధలతో అష్టదళ పాద పద్మారాధనపూజ పండితుల వేద మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వ హణాధికారి బి.లక్ష్మీప్రసన్న, అర్చకులు బి.రవీందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల సేవా సమితి మండల అధ్యక్షుడుగా యాకయ్య

నవతెలంగాణ-పాలకుర్తి

దివ్యాంగుల సేవాసమితి మండల అధ్యక్షునిగా తాళ్లపల్లి యాకయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారనీ పాలకుర్తి నియోజకవర్గం అధ్యక్షురాలు శివరాత్రి సుగుణ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన మండల నూతన కమిటీ సమావేశంలో మండల ఉపాధ్యక్షులుగా గాదరి యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా ఆరూరి యాదగిరి, సహాయ కార్యదర్శిగా వంగాల మల్లికాంబ, కోశాధికారిగా నారబోయిన యాకయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : ఐద్వా

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్



పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవల్ని అందించాలని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇర్రి అహల్య, ఎండీ షబానా డిమాండ్ చేశారు. ఆకమిటీ ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిని సందర్శించి రోగుల సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి వైద్యులతో సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేరుకే 30పడకల ఆసుపత్రితప్ప కనీస వసతులు కరువయ్యాయని అన్నారు. రోగుల కోసం ఏర్పాటు చేసిన ఎక్స్‌రే, స్కానింగ్ వంటి సౌకర్యాలు లేవన్నారు. ఆసుపత్రి ఉన్నతశ్రేణిగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ సరిపోనూ వైద్యులు లేక, రోగులకు సేవలు అంతమాత్రంగానే అందుతున్నాయన్నారు. పరిసరాలు శుభ్రంగా లేవని, రోగులకు సరిపడా పడకల ఏర్పాటు, ప్రసవాలకు కూడా సౌకర్యాలు లేవని అన్నారు. ఆసుపత్రి ఆవరణ చుట్టూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే విధంగా వైద్యులు పని చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ధైద రాములమ్మ, సంపత్, విజయ, కొంతం లక్ష్మిలు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

- జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్



నవతెలంగాణ-నర్మెట్ట

మొక్కను నాటి సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. 75వ వనమహోత్సవ కార్యక్ర మంలో భాగంగా స్థానిక నర్మెట్ట మోడల్ స్కూల్‌లో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అందరూ తమ కుటుంబ సభ్యులతో సహా మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని తద్వారా పర్యావరణాన్ని కాపాడిన వారమవుతామని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డిఓ చంద్రశేఖర్, ఎంపీడీవో అరవింద్, ఎంఎన్ఓ ఐలయ్య, ప్రిన్సిపాల్ టీ.శరత్‌కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట : వన మహోత్సవం కార్యక్రమం దిగ్విజయంగా జరిపి మొక్కలను విరివిగా పెంచాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కొడవటూర్ గ్రామపంచాయతీ, జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ చెట్లను విరివిగా పెంచినప్పుడే మానవాళి ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఘు రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

- ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందునాయక్



నవతెలంగాణ-జనగామ

రైతుభరోసా, రుణమాఫీ, ధరణి రైతాంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ వెంకన్నకి అందజేశారు. ధర్నా కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందునాయక్ మాట్లాడుతూ రైతు రుణమాఫీ, ధరణి సమస్యలు పరిష్కరించేందుకు కమిటీలువేసి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. రుణమాఫీ ఏకకాలంలో రూ.2 లక్షలు చేస్తామని, అదేవిధంగా ధరణి సమస్యలు అన్నింటిని పరిష్కరిస్తామని, రైతుభరోసా ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా ప్రభుత్వం దాటవేత ధోరణితో వ్యవహరిస్తుందన్నారు.

వర్షాకాలం సాగు ప్రారంభమైనప్పటికీ రైతులకు నేటికీ డబ్బులు అందలేదన్నారు. వడ్డీలకు డబ్బులు తెచ్చి రైతులు అప్పుల పాలవుతున్నారన్నారు. రైతులు పండించిన పంటలకు స్వామినాథన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతుధరల చట్టం పెట్టి బడికి అదనంగా 50శాతం కలిపి చట్టం చేస్తామని రాతపూర్వకంగా హామీఇచ్చి తుంగలో తొక్కారని విమర్శించారు. విద్యుత్ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని పంటల బీమాపథకానికి రైతులకు అనుకూలంగా మార్చాలన్నారు.

కేంద్ర ప్రభుత్వ కిసాన్ సంబంధించినది రూ. 15 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. 2022 లో వడగండ్ల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ హామీ మేరకు పంటల బీమాపథకాన్ని తీసుకోవాలన్నారు. రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

ఈ ధర్నా కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం నాయకులు బూడిద గోపి, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి అజ్మీర సురేష్‌నాయక్, పట్టణ అధ్యక్షులు ఉర్సుల కుమార్, రైతు సంఘం సీనియర్ నాయకులు రామచక్కం, నాయకులు కోయిలకారు గడ్డం శివ, నాగరాజు, తాండ్ర ఆనందం, కర్రే రాములు కర్రే బీరయ్య, అవిశెట్టి గట్టయ్య అజ్మీర మల్లేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

జలమయంగా మారిన బాణాపురం రోడ్డు

- బాణాపురం అభివృద్ధిపై చైర్‌పర్సన్ నిర్లక్ష్యం వీడాలి
- సీపీఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్



నవతెలంగాణ-జనగామ

పట్టణంలోని 5వ వార్డు బాణాపురంలో గల ప్రధాన బీటీ రోడ్డు వర్షానికి కృంగిపోయి గుంతలమయమై చెరువును తలపిస్తుందని సీపీఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో బాణాపురంలో గుంతలమయంగా మారిన రోడ్డు పై సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలు బురద నీటిలో నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగ జోగు ప్రకాష్ మాట్లాడుతూ బాణాపురం అభివృద్ధి పట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ వివక్ష చూపుతోందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తన కుర్చీని కాపాడుకోవడంలో చూపుతున్న శ్రద్ధ జనగామ పట్టణ ప్రజల అభివృద్ధిపై లేదన్నారు. కుర్చీకి పరిమితమై పాలన సాగిస్తుందన్నారు. వర్షాకాలం వస్తే కొన్ని ప్రాంతాలు మొత్తంగా జలమయంగా మారి ఇళ్లలోకి నీరుచేరుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆయా ప్రాంతాలలో ఇళ్లల్లోకి వర్షం నీరు రాకుం డా చేసే ప్రణాళిక నేటికీలేదన్నారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు పూర్తిగా నాసిరకంగా నడుస్తున్నా మున్సిపల్ చైర్‌పర్సన్ కమిషన్‌లకు కక్కుర్తిపడి నాణ్యత ప్రమాణాల విషయంలో పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జనగామ పట్టణం సూర్యాపేట రోడ్డు కలెక్టర్ ఆఫీస్, హైదరాబాద్ హైవేరోడ్డు వరకు, సిద్దిపేట రోడ్డు సెంటర్ డివైడర్ల నిర్మాణం పూర్తి నాణ్యత లోపించింది అన్నారు. కాంట్రాక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. నాణ్యతలేమి, అవినీతి జరుగుతున్నా పట్టించుకోకపోవడంలో అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. పట్టణంలోని అంతర్గత రోడ్లలో డ్రైనేజీ, చెత్తతీయక మురు గునీరు ఇండ్ల మధ్యన చేరి దోమల బెడదఎక్కువై ప్రజలు రోగాల బారిన పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. లక్షలది రూపాయలు బ్లీచింగ్‌కు, దోమల నివారణకు ఖర్చు పెడుతున్నామని కాగితాలలో రాసుకుంటున్నారు తప్ప వాటిని ఎక్కడ చల్లింది లేదన్నారు. కచ్చా డ్రైనేజ్ ఉన్న ప్రాంతాలలో ఎక్కువగా దోమల బెడద ఉందన్నారు. ఇప్పటికైనా లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు ఆగకుండా చూడాలని, బాణాపురంలో అంతర్గత డ్రైనేజీ ఏర్పాటు చేసి చెడిపోయిన బీటి రోడ్డుపై వెంటనే సీసీ రోడ్డు పోసి నీరు ఆగకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇదే రోడ్డుపై గతంలో అనేకసార్లు నాట్లు వేసి నిరసన తెలిపినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

ఇప్పటికైనా బాణాపురంలో ఉన్న డ్రైనేజీ సిసి రోడ్ల వంటి సమస్యల్ని సత్వరమే పరిష్కరించకుంటే ఐదవ వార్డు ప్రజల్ని సమీకరించి మున్సిపల్ కార్యాలయాన్ని దిగ్బంధం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీ ఎం జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్, పట్టణ కమిటీ సభ్యులు కళ్యాణ లింగం, వసంత, పద్మ రజిత, కుమారి, మమత, నీల, ఎండి.గౌసియా, నాజియా, జయ, రజిత, శాంత, భాగ్య, సౌందర్య, అబ్రహంలింకన్, ఆనందం, సుధాకర్, కుమార్, గణేష్, కమల, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని పూజించడమే గిరిజనుల సాంప్రదాయం





- ఘనంగా తండాల్లో 'సీత్ల' వేడుకలు
- కాలంమారినా కొనసాగుతున్న గిరిజనుల సంస్కృతి

నవతెలంగాణ-పాలకుర్తి

ప్రకృతిని పూజించడమే గిరిజనుల సాంప్రదాయం ఆనవాయితీగా వస్తుంది. తొలకరి పలకరించి, పుడమి పులకరించడంతో తనువంత పచ్చదనంతో పరిమళించింది. నేలతల్లి రుణం తీర్చుకోవడానికి రైతన్నకు తోడుండే ప్రకృతిసంపదను రక్షించుకోవడానికి ప్రకృతిని ఆరాధించడం గిరిజన లంబాడీలకు వందల ఏళ్లుగా సంస్కృతి, సాంప్రదాయాలు ఆన వాయితీగా వస్తున్నాయి. గిరిజన తెగల్లో ఈ ఆచారాన్ని ప్రత్యేకంగా లంబాడితండాల్లో జరుపుకుంటున్నారు. ఆషాడమాసంలో చిన్నపుషాల, పెద్దపుషాల మధ్య వచ్చే మంగళవారం ఈపండుగకు సరైనరోజు. మంగళవారం తండాల్లో సీత్ల వేడుకలను గిరిజన లంబాడీలు అంగరంగ వైభవంగా కన్నులపండుగగా జరు పుకున్నారు. తండాపెద్దనిర్ణయం ప్రకారంగా తండావాసులు అంతా కలిసి పూజారి సమక్షంలో సీత్ల పండుగను నిర్వహిస్తారు. సీత్లనే (దాటుడు) అని కూడా పిలుస్తారు. పశువులను దాటించడం సీత్ల పండుగలో పరమార్థం. ప్రకృతి దేవత సీత్ల భవాని సప్త మాతకలను సాత్ భవానీలుగా బంజారా గిరిజనులు ఆరాధిస్తారు. సాత్ భవానీల్లో సీత్లను దాటుడు పండుగగా గిరిజన లంబాడీలు కొలుస్తారు. సీత్ల పండుగలో బంజారా సాంప్రదాయానికి అనుగుణంగా కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఏడు రాళ్లను సాత్ భవానీలరూపంలో కొలుస్తారు. ఏడురాళ్లను జాదుతో అలంకరించి, ప్రతి ఇంటి నుండి జొన్నలతో చేసిన (గుగ్రి) గూడాలనుసంస్కృతి, సాంప్రదాయాలతో, గిరిజన వస్త్రాల వేషధారణతో డప్పుచప్పులతో ఆటపాటలతో సాత్‌భ వానీల ముందు గిరిజన లంబాడి మహిళలు నైవేద్యంగా సమ ర్పించారు. పశువులను సాత్‌భవాని, (లుంకడ్) పోతురాజుల మధ్య ఏర్పాటు చేసేమేక పేగుపై నుండి దాటిస్తూ బలిపశువులపై చల్లారు. దీంతో పశువులకు ఎలాంటి వ్యాధులురావని బంజారాల నమ్మకం. సీత్ల పండుగను జ రుపుకునే మైదానంలో గిరిజన మహిళలు ఆటపాట లతో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

కాలం మారినా కొనసాగుతున్న గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలు ....

ఆధునిక కాలంలో వచ్చిన మార్పులు సీత్ల పండుగ మీద ఎలాంటి ప్రభావం కనిపించకపో వడం గమనార్హం. బంజారాల ఆర్థిక పరి పుష్టికి పశు సంపద ఓ కారణం. నేటికీ పశువులను మచ్చిక చేసు కోవడం తండాల్లో చూడవచ్చు. తండా పెద్దల పర్య వేక్షణలో తండా నిర్వహణ ఉంటుంది. పండుగ ప బ్బాలు వీరి ఆధ్వర్యంలో కొనసాగడం నేటికి గిరిజన సంస్కృతి సంప్రదాయాలు ఆచారంగా వస్తున్నాయని పలువురు మేధావులు అభిప్రాయపడుతున్నారు.

ఏసీబీకి పట్టుబడ్డ పంచాయతీ కార్యదర్శి

రూ. 20 వేలు లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిన వైనం





నవతెలంగాణ-జనగామ

పంచాయతీ కార్యదర్శి రూ. 20 వేలు లంచం డిమాండ్ చేసి ఏసీబీకి పట్టుబడ్డాడు. మంగళవారం వరంగల్ ఏసీబీ అధికారులు పంచాయతీ కార్యదర్శిని వలపన్ని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కంచనపల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ గవ్వాని విజయ భర్త గవ్వాని నాగేశ్వరరావు గ్రామపంచాయతీలో రూ. 1.50 లక్షల కాంట్రాక్టు పనులు చేపట్టాడు. ఆ బిల్లుల క్లియరెన్స్ కోసం మాజీ సర్పంచ్ భర్తను పంచాయతీ కార్యదర్శి పగిడే శివాజీ రూ.50వేలు డిమాండ్ చేశాడు. అంత పెద్దమొత్తంలో ఇవ్వలేనని నాగేశ్వరరావు కార్యదర్శి తోచెప్పాడు. చివరకు రూ.20 ఇస్తామని చెప్పడంతో కార్యదర్శి అంగీకరించా డు. అనంతరం నాగేశ్వరరావు వరంగల్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఇందులో భాగంగా మంగళవారం నాగేశ్వరరావు రఘునాథపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద సదరు డబ్బులను కార్యదర్శి శివాజీకి ఇచ్చాడు. ఆ సమయంలో ఏసీబీ అధికారులు చాకచక్యంగా వలపన్ని కార్యదర్శిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ మాట్లాడుతూ సాంబయ్య మాట్లాడుతూ రైడ్‌లో పట్టుబడ్డ పంచాయతీ కార్యదర్శిని బుధవారం ఏసీబీ నాంపల్లి కోర్టులో హాజరు పరుచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేసినట్లయితే ఏసీబీని ఆశ్రయించాలన్నారు. ఈ దాడుల్లో సిఐలు సట్ల రాజు, ఎల్.రాజు తదితరులు ఉన్నారు.

ఎస్ఐ మృతిపై న్యాయ విచారణ జరిపించాలి

- కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు తుటి దేవదానం

నవతెలంగాణ-జనగామ



అశ్వరావుపేట ఎస్ఐ శ్రీరాములు శ్రీనివాస్ మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి చేత న్యాయవిచారణ జరిపించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు తుటి దేవదానం డిమాండ్ చేశారు. దళిత ఎస్సై శ్రీనివాస్ మృతికి బాధ్యులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జనగామ పట్టణంలో కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి బోట్ల శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దేవదానం మాట్లాడుతూ శ్రీనివాస్ మృతికి కారణమైన సీఐ, సిబ్బందిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. స్థానిక సీఐ జితేందర్‌రెడ్డి వేధింపుల వల్లనే ఎస్సై ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. పోలీసులకు సంబంధం లేని సివిల్ కేసులలో ఎస్ఐని ఇన్వాల్వ్ కావాలని సీఐ బలవంతం పెట్టడం వల్లనే ఆత్మహత్యాకు దారి తీసిన అన్నారు. చట్టాలు అమలు చేయాల్సిన ఎస్ఐకే కుల వివక్ష తప్పలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐని ఇతర పోలీస్ ఉద్యోగస్తులను తక్షణమే విధుల నుండి తొలగించాలని, వారికి కఠిన శిక్షలువేసి ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం విధించాలని డిమాండ్ చేశారు. ఎస్సై శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలిచి ఆయన సతీమణికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ప్రభుత్వం రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలన్నారు. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షురాలు పల్లర్ల లలిత, నాయకులు గడ్డం యాదగిరి, ఎండి.అతియసుల్తానా, అరూరి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

గానకోకిల పురస్కారానికి సంజీవ ఎంపిక

నవతెలంగాణ-లింగాలఘనపురం



మండల కేంద్రానికి చెందిన ఉద్యమగాయకుడు, ధూమ్ ధాం కళాకారుడు గట్టగల్ల సంజీవను ఉద్యమ గానకోకిల పురస్కారంకు ఎంపిక చేసినట్లు ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేకల చంద్రశేఖర్ యాదవ్ ప్రధాన కార్యదర్శి ముక్కెర సంపత్‌కుమార్‌లు మంగళవారం తెలిపారు. ఈ నెల 12న కరీంనగర్ ప్రెస్ భవన్ లో ఆవిర్భావ సమావేశంలో తెలంగాణ ఉద్యమ నాయకులకు సన్మానం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. తనను పురస్కారానికి ఎంపిక చేసిన చంద్రశేఖర్ యాదవ్, ముక్కెర సంపత్ కుమార్‌లకు సంజీవ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీకే సాధ్యం

నవతెలంగాణ-పాలకుర్తి



గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డిల ఆదేశాల మేరకు మన ఊరు మన కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని ముత్తారంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి గౌడ్, కొడకండ్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావులతో కలిసి గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలను కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు బొమ్మగాని భాస్కర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పరిష్కారం కాని సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు ఎమ్మెల్యే కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. గ్రామాల అభివృద్ధితో పాట ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే సీఎం రేవంత్ రెడ్డి నేతత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. సమస్యలపై ఎమ్మెల్యేకు నివేదిక అందజేస్తామని తెలిపారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా రెపరెపలాడేందుకు కార్యకర్తలందరూ సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ చిలువేరు కృష్ణమూర్తి, నాయకులు గాదపాక భాస్కర్, మాజీ ఎంపీపీ కారుపోతుల శ్రీనివాస్, జలగం కుమార్, సేవాదళ్ రాష్ట్ర ఆర్గనైజర్ గుగ్గిళ్ళ ఆదినారాయణ, గోన మహేందర్ రెడ్డి, నల్ల మాస రమేష్ గౌడ్, భూమ రంగయ్య, నాగరాజ్, కోలా వేణు, కున్సోత్ రవి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

మండల కేంద్రంలో గల ఎంపీడీవో కార్యాలయంలో నేడు బుధవారం అర్హులైన మహిళలకు కల్యాణ చెక్కులను పంపిణీ కార్యక్రమం ఉంటుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి లబ్దిదారుల వివరాలను గ్రామాల వారీగా కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులకు అందజేశామన్నారు. ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని లబ్దిదారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు.



స్కావెంజర్లను నియమించాలి : యూటీఎఫ్

నవతెలంగాణ-మహబూబాబాద్

ప్రభుత్వ పాఠశాలలో స్కావెంజర్లను నియమించాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఏ మురళీకష్ణ కోరారు. మంగళవారం మహబూబాబాద్ మండలంలో మహబూబాబాద్ జిల్లా యుటిఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నో ఏళ్లగా ఎదురుచూస్తున్న పదోన్నతులను బదిలీలను సజావుగా సాగే విధంగా సహకరించిన ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులకు రావాల్సిన ఐదు డీఏలను, పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో పరిశుభ్రతను నెలకొల్పడానికి స్కావెంజర్ల ను నియమించి విద్యార్థుల ఆరోగ్యానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు హరినాయక్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ మండల ఉపాధ్యక్షుడు కుమార్ మరియు సీనియర్ కార్యకర్తలు మైసయ్య,ప్రసాద్ ,రాజశేఖర్ ,రంజా,షబ్బీర్, భరత్ కుమార్ పాల్గొన్నారు

సమాజ సేవ హితమే లయన్స్ క్లబ్ లక్ష్యం

డిస్ట్రిక్ట్ గవర్నర్ కుందూరు వెంకటరెడ్డి

నవతెలంగాణ తొర్రూరు

సమాజ హితమే లైన్స్ క్లబ్ లక్ష్యంగా పనిచేస్తుందని డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ కుందూరు వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం తొర్రూర్ లోని లయన్స్ క్లబ్ 2024-25 లయన్స్టిక్ ఇయర్‌కు 37వ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకర కార్యక్రమం లయన్ గంజి విజయ పాల్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా వెంకటరెడ్డి హాజరై మాట్లాడారు. తొర్రూర్ లైన్స్ క్లబ్ అత్యధిక మంది సభ్యులతో జిల్లాలోనే ద్వితీయ స్థానంలో ఉన్నదని అన్నారు. మొదటి వైస్ డిస్టిక్ గవర్నర్ లయన్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య, నూతన అధ్యక్షునిగా లయన్ చిదిరాల నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా తమ్మి రమేష్ , కోశాధికారిగా భువనగిరి శంకర్, ఇతర కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. తొర్రూర్ లయన్స్ క్లబ్ నూత సభ్యులుగా చిదిరాల చంద్రయ్య , గంగిశెట్టి రమేష్ కుమార్ ,బోనగిరి వేణుమాధవ్ ,గుండా నాగరాజు, మరియు సునీల్‌తో సెకండ్ వైస్ డిస్టిక్ గవర్నర్ సుధాకర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షుడు నవీన్ కుమార్ మాట్లాడుతూ శాశ్వత ప్రాజెక్టు కింద తొర్రూర్ సమీపంలో వృద్ధాశ్రమాన్ని, అనాథాశ్రమాన్ని నిర్మించడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీడీజీలు లయన్ ముచ్చ రాజిరెడ్డి, లయన్ టి లక్ష్మీనరసింహారావు, లయన్ పి శ్రీనివాసరావు, లయన్ డాక్టర్ లవ కుమార్ రెడ్డి, లయన్ సయ్యద్ హబీబ్ డి సి ఎస్, రీజియన్ చైర్మన్ ఆర్ వెంకట్ రెడ్డి, జోన్ చైర్మన్ లయన్ రేగురి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన లేకుంటే రాజీనామా చేయండి : ఎల్‌హెచ్‌పీఎస్

నవతెలంగాణ-గూడూరు

చట్టాలపై అవగాహన లేకపోతే రాజీనామా చేయండని, గిరిజన భూముల జోలికి వస్తే సహించేది లేదని ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు భీమానాయక్ అన్నారు. మంగళవారం గూడూరు మండలంలో ఏకలవ్య పాఠశాల నిర్మాణం ప్రభుత్వంలో భూములను పరిశీలించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా భీమానాయక్ విలేకరులతో మాట్లాడారు. న్యాయం కోసం పోరాటం చేస్తున్న గిరిజన హెూంగార్డును సస్పెండ్ ఎలా చేస్తారని అన్నారు. తక్షణమే హెూంగార్డు ను విధుల్లోకి తీసుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. హెూంగార్డు కుటుంబానికి ఏదైనా జరిగితే తహసీల్దార్, అధికారులే బాధ్యత వహించాలన్నారు. పిసా చట్టాన్ని అమలు చేయకుండా, స్థానిక తహసిల్దార్ చట్టానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. తీర్మానం లేకుండానే భూములు గుంజుకుంటున్నారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ పట్టించుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయకుంటే మండల బంద్‌కు పిలుపునిస్తామన్నారు. ఎల్ హెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజ వాసు నాయక్, ఎన్ టీపీఎస్ రాష్ట్ర అధక్షులు భానోత్ రామన్ననాయక్, ఎల్‌హెచ్‌పిఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి చందులాల్ నాయక్, వికలాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు బి రాందాస్‌నాయక్, జిల్లా నాయకులు బి శ్రీను నాయక్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు భూక్య పద్మ నాయక్, భూబాధితులు కమలమ్మ, నాగమణి పాల్గొన్నారు.

మత్స్యశాఖ అధికారికి తీర్మానం అందజేత

నవతెలంగాణ- దంతాలపల్లి

18ఏండ్లు పైబడిన ముదిరాజ్(మత్స్యశాఖ)సభ్యులకు సభ్యత్వాలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్, మహాసభ రాష్ట్ర కార్యదర్శి నీలం దుర్గేష్, ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు కాట భాస్కర్ సహకారంతో మహబూబాబాద్ జిల్లా మత్స్యశాఖ అధికారి నాగమణికి కుమ్మరి కుంట్ల మత్స్యశాఖ సహకార సంఘం సభ్యత్వ తీర్మానాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుమ్మరి కుంట్ల మత్స్యశాఖ అధ్యక్షులు దుండి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ. కుమ్మరి కుంట్ల, నిదానపురం గ్రామాలకు చెందిన ముదిరాజ్‌లకు సభ్యత్వాల కోసం తీర్మానం కాపీని అందజేశామన్నారు. కుమ్మరి కుంట్ల మత్స్య సహకార సంఘం అధ్యక్షులు దుండి వెంకటేశ్వర్లు ముదిరాజ్, మత్స్య సహకార సంఘం కార్యదర్శి చిల్లా రామనారాయణ ముదిరాజ్, చిల్లా రామకష్ణ ముదిరాజ్, పాక ధర్మయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనం నిర్మించాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-మహబూబాబాద్

స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థలో ఉందని నూతన భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు డిమాండ్ చేశారు. మంగళవారం కళాశాలను సందర్శించి మధు మాట్లాడుతూ... ఏండ్లు గడుస్తున్నా కళాశాల సమస్యలను పట్టించుకునే నాధులే కరవయ్యారని అన్నారు. సరైన వసతులు లేక కళాశాల వెలవెలబోతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు గుగులోత్ సూర్య ప్రకాశ్, హరీష్, మహేష్ , వినయ్ పాల్గొన్నారు.

'ఈనెల 11న ముట్టడి కార్యక్రమం'

నవతెలంగాణ- కేసముద్రం రూరల్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న 60 వేల మంది సిబ్బందికి వేతన బకాయిలతోపాటు కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 11న రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యాలయాన్ని ముట్టడి కార్యక్రమం చేపట్టినట్టు తెలంగాణ,భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్‌టియు మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కె భాస్కర్ రెడ్డి అన్నారు. మంగళవారం కేసముద్రం గ్రామపంచాయతీ ఆవరణలో చలో హైదరాబాద్ కరపత్రాన్ని ఆవిష్కరించి యాకయ్య మాట్లాడారు. పది నెలల నుండి వేతనాలు అందడం లేదని అన్నారు. మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన విధంగా పంచాయతీ కార్మికులకు వేతనాలు ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఉప్పలయ్య, రాములు, వెంకటయ్య, మల్లయ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ- కేసముద్రం రూరల్

కేసముద్రం మండలం మహమూదపట్నం గ్రామంలోని సర్వే నెంబర్ 815లోని గడ్డిబోడును తవ్వేందుకు ఎలాంటిఅనుమతులు ఇవ్వవద్దని కోరుతూ స్థానిక తహసీల్దార్‌కు మంగళవారం స్థానికులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహమూద్పట్నం గ్రామంలోని సర్వే నెంబరు 815లో గడ్డిబోడులో లింగమంతుల స్వామి గుడి, గడ్డిబోడు మైసమ్మ గుడి ఉందని అన్నారు. ఏటా పండుగలు, పూజలునిర్వహిస్తున్నామన్నారు. కాగా గడ్డిబోడు మట్టిని తరలించేందుకు ప్రయత్నాలు సాగుతున్నట్లు తెలిసిందన్నారు. గడ్డిబోడుపై మట్టిగాని, చదును చేయడం గాని ఎలాంటి అనుమతులు ఇవ్వవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శతకోటి నరేష్ యాదవ్ ,ఏశబోయిన కేతమ్మ ,ఎల్లయ్య, మాజీ సర్పంచ్, ఏషబోయిన యాకయ్య, పాశం కొమురయ్య, ఏశబోయిన రవీందర్, బోయినవెంకన్న, ఉమేష్, మురళి , తది తరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

మరిపెడ పాఠశాల ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రాజకుమారి

నవతెలంగాణ -మరిపెడ

మరిపెడ మండలం నుండి ఎడ్జర్ల, సీతారాంపురం ప్రాథమిక పాఠశాలల నుండి సాత్వికనంద, సాత్విక, నిత్యశ్రీ, మేఘన గత నెల 29న ఎన్టీఆర్ స్టేడియంలో మహబూబాబాద్ జిల్లా స్థాయి పోటీలలో విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు మరిపెడ పాఠశాల ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రాజకుమారి మంగళవారం తెలిపారు. పోటీలలో జిల్లాకు చెందిన వివిధ మండలాల నుండి 100 మంది విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన విద్యార్థులు నేడు(బుధవారం) హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం మరిపెడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంతరావు, సీనియర్ ఉపాధ్యాయులు రామ్మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

విద్యకు ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే మురళినాయక్

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని, చదువుతో పాటు ఉద్యోగ ఉపాధి అవకాశాలను అందుపుచ్చుకునే విధంగా విద్యారంగాన్ని తీర్చిదిద్దుతుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ అన్నారు. మంగళవారం కేసముద్రం మండలానికి నూతనంగా మంజూరైన డిగ్రీ కళాశాలను ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించడానికి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో ఐదవ తరగతి నుంచి పీజీ వరకు చదువుతోపాటు వసతి కల్పించి ఉద్యోగ ఉపాధి అవకాశాలను అందిపు చ్చుకు



నేలా కార్యాచరణ అమలు చేస్తున్నారని చెప్పారు. ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్ ను 25 ఎకరాల్లో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కేసముద్రం స్టేషన్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను సందర్శించి పాఠశాల ఆవరణ చదును చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు, కేసముద్రం స్టేషన్ టౌన్ అధ్యక్షులు రావుల మురళి, నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్, బట్టు శ్రీనివాస్, వీరేష్ యాదవ్, యశ్వంత్, నజీర్, ప్రభుత్వ కళాశాల సిబ్బంది కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

సమస్యలు పరిష్కరించాలని వినతి

కేసముద్రం మండల కేంద్రంలో క్రైస్తవులకు ప్రత్యేక స్మశాన వాటిక కోసం స్థలం కేటాయించాలని పాస్టర్స్ ఫెలోషిప్ బాధ్యులు కోరారు. కేసముద్రంకు వచ్చిన ఎమ్మెల్యే మురళి నాయక్‌కు వినతిపత్రం అందజేసి వారు మాట్లాడారు. క్రైస్తవులు చనిపోతే గౌరవప్రదంగా సమాధి చేయడానికి ప్రత్యేక స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారం లో క్రైస్తవ స్మశాన వాటికకు స్థలం కేటాయించేందుకు ఎమ్మెల్యే హామీనిచ్చినట్టు తెలిపారు.కేసముద్రం మాజీ సర్పంచ్ బట్టు శ్రీనివాస్, పాస్టర్స్ అండ్ లే లీడర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షులు పిల్లి కుమారస్వామి, కేసముద్రం మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు అప్పాల పేతురు , కార్యదర్శి ఎలుక ప్రభుజీవన్, కోశాధికారి జల్లే ఇజ్రాయిల్, ముఖ్య సలహాదారులు పిల్లి సారంగపాణి, ఖాతా ఫిలిప్ ఇస్లావత్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

రింగ్ రోడ్డు డిపిఆర్ రూపకల్పనకు రూ.23.50 లక్షలు



- మున్సిపల్ చైర్మెన్ రామ్మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ చుట్టూ రింగ్ రోడ్డు డిపిఆర్ కోసం రూ.23.50 లక్షలు కేటాయించినట్లు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం మహబూబాబాద్ మున్సిపాలిటీలో ఇంజనీరింగ్ అధికారులు కౌన్సిలర్లతో కలిసి డీపీఆర్‌పై చర్చించారు. చైర్మన్ మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన కౌన్సిలర్ల సమావేశంలో రింగ్ రోడ్డు నిర్మాణం కోసం ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్‌ని కోరగా స్పందించి డీపీఆర్ రూపకల్పన చేయాలని ఆదేశించినట్టు తెలిపారు. దీంతో రింగు రోడ్డు పై డీపీఆర్ సర్వే కోసం మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపినట్టు చెప్పా రు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుర్గపు సోమయ్య, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, ఫ్లోర్ లీడర్లు చిట్యాల జనార్ధన్, వెన్నం లక్ష్మారెడ్డి, అజయ్ సారథి, డీఈ ఉపేందర్, కౌన్సిలర్లు పోతురాజు రాజు, బానోత్ పద్మ సీతారాం నాయక్ , దండెబోయిన వెంకన్న , మార్నేని శ్రీదేవి రఘు, దౌలాగర్ స్వాతి శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు





నవతెలంగాణ-బయ్యారం

కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయంలో మంగళవారం మంత్రి ధనసరి సీతక్క పుట్టినరోజు వేడుకలు రామచంద్రాపురం ఎంపీటీసీ భూక్యా లక్ష్మి(గణేష్) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎంపీటీసీ భూక్యా లక్ష్మి మాట్లాడుతూ.. కరోనా కష్ట కాలంలో సీతక్క సేవా కార్యక్రమాలు మరువలేనివని అన్నారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గట్ల గణేష్, జిల్లా ఎస్టీ సెల్ జిల్లా నాయకులు బానోత్ రాము నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గౌరి శెట్టి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి శుభాకాంక్షలు : కాంగ్రెస్ నాయకులు

రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క జన్మదినం సందర్భంగా ములుగు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు వడ్లమూడి సురేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ గోగినేని సీతారామయ్య పాల్గొని సీతక్కను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

గార్ల : అఖిల భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి ధనసరి సీతక్క జన్మదిన వేడుకలను స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండా వెంకట్ రెడ్డి, తాళ్లపల్లి కష్ణ గౌడ్, షంషాద్ బేగం, బి హతిరాంనాయక్,షేక్ యాకుబ్ పాష, కె కుమార్ గౌడ్, బాబులాల్, కె.వెంకన్న,రావూజీ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా సీత్లా పండుగ వేడుకలు

నవతెలంగాణ-బయ్యారం

గిరిజన లంబాడీల పూర్వ ఆచార, సాంప్రదాయ పండుగైన సీత్లా(దాటోడి) పండుగను మంగళవారం మండల వ్యాప్తంగా గిరిజన గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. పాడి పంటలు, పశు సంపద సంవృద్ధిగా ఉండాలని ఆకాంక్షించారు.

వేడుకలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బిందు...

మండలంలోని బాల్యాతండా గ్రామంలో సీత్లా (దాటోడి) పండుగను ఘనంగా నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా చైర్‌పర్సన్ అంగోత్ బిందు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ జిల్లా నాయకులు అంగోత్ శ్రీకాంత్‌నాయక్, గ్రామ మాజీ సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

గూడూరు : గూడూరు మండలంలో పలు గ్రామాలలో గిరిజన సంప్రదాయాలతో సీత్ల భవాని పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏపూరి గ్రామంలో ఒక్కరు మారిన చాలు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు గ్రహీత మాట్లాడారు. ఈ సంవత్సరం గిరిజనులు అందరూ ప్రతి తండాలో ఒకే సారి ఈ పండుగను జరుపుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. పాడి పశువులు, పంటలతోపాటు ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. పూజారి వాంకు7 దోతు ఆలియా, వాంకుడోతూ రాముడు, వాంకుడోత్ మోతిలాల్ నాయక్, సర్దార్ బాబు, జైలు బాబు, రాములు బొజ్జా శ్రీను. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గార్ల: గిరిజనులు ప్రతి ఏటా పెద్దపుశాల కార్తెలో నిర్వహించుకునే సీత్లాభవాని పండుగను మండలంలోని మర్రి గూడెం, పినిరెడ్డిగూడెం, బాలాజీ తండ, బిఆర్ ఎన్ తండా, పెద్ద కిష్టాపురం, చిన్న కిష్టాపురం, వెంకటాపురం తండ, కోట్యానాయక్ తండా తదితర గిరిజన తండా లలో గిరిజనులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేసిన తీర్థ ప్రసాదాలను బోనాల ద్వారా ప్రదర్శన గా వెళ్ళి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. జెడ్పీటీసి జాటోత్ ఝాన్సీలక్ష్మీ బాయి, రైల్వే విశ్రాంత ఉద్యోగి బి.కస్నానాయక్, గిరిజన ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మరిపెడ : గిరిజనుల ఆరాధ్య దైవం సీత్ల పండగ ను మండలంలోని ఉన్న గిరిజన మహిళలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జెడ్పిటిసి తేజావత్ శారదా రవీందర్ పాల్గొని పూజలు చేసి మాట్లాడారు. వానలు కురవాలని, పాడి పశువులు చల్లగా ఉండాలని, పంటలు





బాగా పండాలని ఆకాంక్షించారు. అనంతరం బోనం ఎత్తుకుని గ్రామ పొలిమేరలోని సీత్లా భవాని వద్దకు తీసుకెళ్లి మొక్కులు సమర్పించారు. మూలమర్రి తండాకు చెందిన గిరిజనులు పాల్గొన్నారు. అలాగే తండ ధర్మారం గ్రామంలో మాజీ ఎంపీపీ గూగులోత్ అరుణ రాంబాబు, శీతల పండుగా వేడుకల్లో పాల్గొన్నారు. మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో మున్సిపాలిటీ చైర్మన్ గూగులోత్ సింధూర రవి నాయక్ పాల్గొన్నారు.

చిన్నగూడూరు : చిన్నగూడూరు మండల కేంద్రంలోని మేగ్యతండా గ్రామంలో మంగళవారం ఘనంగా సీత్లా పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా సీత్లా భవానీకి బోనం సమర్పించారు. సేవాలాల్ సేన చిన్నగూడూరు మండల అధ్యక్షుడు బాదావత్ సురేష్, కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు వెంకన్న, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు చిరంజీవి, రాంబాబు, రెడ్డి, బాసు, తదితరులు పాల్గొన్నారు.

తొర్రూర్ రూరల్ : గిరిజనులు జరుపుకునే పురాతన సంప్రదాయ పండుగ సీత్లాభవాని(దాటుడు) పండుగ మంగళవారం మండలంలోని గుడిబండ తండగ్రామంలో ఘనంగా నిర్వహించారు. గుడిబండ తండా గ్రామపంచాయతీ పరిధి తండనాయకుల ఆధ్వర్యంలో సీత్లా పండగ నిర్వహించారు. తండా పొలిమేర వద్ద ప్రత్యేక పూజలు చేశారు. డప్పు చప్పుళ్ళలతో యువతులు, మహిళలు, చిన్నారులు నృత్యాలతో వెళ్లి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ సర్పంచ్ లకావత్ శోభన యాకోబు నాయక్ మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపెల్లి శ్రీనివాస్, హనుమాన్ల ప్రదీప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి : డీఎంహెచ్ఓ

నవతెలంగాణ-మహబూబాబాద్

వర్షాకాలంలో ప్రజారోగ్యం పట్ల వైద్యుల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ కళావతి బాయి అన్నారు. మంగళవారం కురవి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి కాంపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని ఆకస్మికంగా సందర్శించారు. సబ్ సెంటర్ లోని రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. సకాలంలో విధులకు హాజరై ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు అయ్యేలా చూడాలని అన్నారు. సీజనల్ వ్యాధులు ఫైలేరియా, మలేరియా కేసుల గురించి తెలుసుకొని సరైన చికిత్స అందించాలని వివరించారు.

జీపీ కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ కేసముద్రం మండలం కేసముద్రం గ్రామపంచాయతీ సిబ్బంది మంగళవారం స్థానిక జీపీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీతాలు ఇవ్వాలని కోరితే కార్యదర్శి బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. వేతనాలు లేక ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు 9 నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే తమ కుటుంబ పోషణ ఎలా అని ప్రశ్నించారు. జీపీ సిబ్బంది అనిల్, అశోక్, శీను, యాకయ్య ప్రమోదు శివ సంజీవ మరియమ్మ జ్యోతి, జయంత అలివేల సూరమ్మ, సంగీత్ లక్ష్మణ్ లింగమ్మ జాన్సన్, వెంకటయ్య, సమ్మయ్య, సునీత శ్రీనివాస్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక మహిళా ఆత్మహత్య

నవతెలంగాణ -మరిపెడ

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఉల్లెపల్లి గ్రామానికి చెందిన నవిలే రేణుక(36) కడుపునొప్పి భరించలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం రాత్రి జరిగింది. బంధువులు తెలిపిన కథనం ప్రకారం రేణుకకు విపరీతమైన కడుపునొప్పి రావడంతో భరించలేక రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించారు. భర్త నవిలే లాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ -చిన్నగూడూరు

చిన్నగూడూరు మండల కేంద్రంలో అల్లం వెల్లుల్లి వ్యాపారులతో ఇల్లులు తిరిగి రేషన్ బియ్యం కొని రైస్ మిల్లర్లకు అక్రమంగా సరఫరా చేస్తున్నారు. పక్కా సమాచారం అందుకున్న పోలీసులు రేషన్ బియ్యం పట్టుకున్నారు. ఈ ఘటన మంగళశారం జరిగింది. ఎస్ఐ ఝాన్సీ తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి జిల్లాకు చెందిన భూక్య శ్రీను 40బస్తాలు (10 క్వింటాలు) బియ్యం వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నారు. బండిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మంగ్య, నరేష్ తదితరులు ఉన్నారు.

రైతులు లేకుండా... రైతుల సదస్సు.

నవతెలంగాణ-చిన్న గూడూరు

చిన్న గూడూరు మండలం లోని ఉగ్గంపల్లి గ్రామంలో రైతు వేదికలో మంగళవారం రైతులు లేకుండా రైతు సదస్సు నిర్వహించారు. విషయం తెలుసుకున్న రైతులు వ్యవసాయంలో మెలకువలు చెప్పవలసిన అధికారులు మండలంలో ఉన్న రైతులకు ఎవరికి సమాచారం ఇవ్వకపోవడంపై అగ్రహం వ్యక్తం చేస్తు కనీసం డప్పు చాటింపు కూడా చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు ఎందుకు సమాచారం ఇవ్వలేదని సదరు అగ్రికల్చర్ అధికారిని ప్రశ్నించగా వాట్స్అప్ గ్రూపులలో పంపించామని అధికారులు సమాధానం చెప్పుకు రావడం గమనార్హం.

నేషనల్ అవార్డుల ఎంపికకు పంచాయతీలు..?

నవతెలంగాణ- మరిపెడ

నేషనల్ గ్రామ పంచాయతీల అవార్డులకు ఎంపిక ప్రక్రియ జాతీయ స్థాయిలో మొదలైంది. రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు మహబూబాద్ జిల్లాలో 461 గ్రామాలలో సీఈవో నర్మద, ఆధ్వర్యంలో డిపిఓ హరిప్రసాద్ పర్యవేక్షణలో ఎంపీడీవో లు జిల్లాలో ఉన్న మండలాలు వివిధ గ్రామాలలో గత మూడు నెలల నుండి పంచాయతీ కార్యదర్శులు మండలంలోని గ్రామాలు పర్యటిస్తూ సర్వేలు చేశారు. 9 అంశాలపై రిపోర్టును సేకరించినట్లు తెలిసింది, ఈ ప్రక్రియ రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారంతో ముగిసిందని జిల్లాస్థాయి అధికారి ద్వారా 9 అంశాలపై రిపోర్టు సేకరించి తయారుచేసిన నివేదికను ప్రభుత్వానికి అందించ నున్నట్లు తెలిసింది. ప్రధానంగా పేదరికం, జీవనోపాధి, గ్రామాలు ఆరోగ్యం, బాల్య వివాహాల నిర్మూలన, తగినంత నీటి వసతి,5) క్లీన్ అండ్ గ్రీన్, పంచాయతీలో స్వయం అభివృద్ధి మౌలిక సదుపాయాలు కల్పన, సామాజిక సురక్షితమైన గ్రామాలు, మంచి పాలన పంచాయతిలు, మహిళ స్నేహపూర్వక మైన పంచాయతీలుగా, ఎంపిక చేసినట్లు తెలిపారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT MAHABUBABAD
I.P. NO. 06 OF 2018

Between:
Bonagiri Ramu ...Petitioner
And
Bobba Venkat Reddy and others ...Respondents

To
1. Bobba Venkat Reddy S/o Not known, Age: 48 years, Occ: Business, R/o H. No. 1-7-304, Ramchandra puram, Mahabubabad Town and District
2. Bodupally Upendar S/o Ramulu, Age: 48 years, Occ: Business, R/o H.No. 3-5-18, RTC Bus Stanbd Road, Mahabubabad Town and District
3. Thotakuri Hemalatha W/o late Venkateshwarlu, Age: 40 years, Occ: Household, R/o H. No. 3-2-6, Mallam Bazaar, Mahabubabad Town and District
5. Nallabelly Bhaskar S/o Narsaiah, Age: 38 years, Occ: Business, R/o H. No. 1-4-62, Shikharkhan Gadda, Mahabubabad Town and District
6. Sathyanarayana S/o Not known, Age: 50 years, Occ: Business, R/o H. No. 1-4-60, Shikharkhan Gadda, Mahabubabad Town and District
7. Shiva S/o Sathyanarayana, Age : 27 years, Occ: Business, R/o H. No. 1-4-60, Shikharkhana Gadda, Mahabubabad Town and District
8. Vebelishetty Ramarao S/o Venkatnarayana, Age: 48 years, Occ: Business, R/o H. No. 1-5-113/2, Station Road, Mahabubabad Town and District
9. Karlapati Vijay S/o Rammurthy, Age: 33 years, Occ: Business, R/o H. No. 1-4-54, Near Surya Theatre, Mahabubabad Town and District
10. Vemishetty Ambarisha S/o Not known, Age: 50 years, Occ: Business, R/o H. No. 164-23, Yellandu Road, Mahabubabad Town and District
10. Thummu Hymavathi W/o Ravi, Age: 38 years, Occ: Private Chits, R/o H. No. 1-4-83/5, Shikharkhana Gadda, Mahabubabad Town and District
11. Vaddeboina Srinu S/o Narayana, Age: 47 years, Occ: Medical Assistant, R/o. H. No.6-2-35/25, Krishna Colony, Mahabubabad Town and District
12. Motam Koteshwar Rao S/o Not known, Age: 52 years, Occ: Business, R/o H. No. 2-5-22, Near Forest Office lane, Mahabubabad Town and District
13. Gundala Narsamma S/o Upendar, Age: 48 years, Occ: Housewife, R/o. H. No. 2-1-41, Government Boys Junior College Road, Mahabubabad Town and District
14. Macha Dayakar S/o Not Known, Age: 62 years, Occ: Retired Employee, R/o H. No. 2-1-34/3, Government Boys Junior College Road, Mahabubabad
15. Ramesh S/o Not known, Age: 38 years, Occ: Business, R/o H. No. 6-1-205/25/C, Bank Colony, Mahabubabad Town and District
16. Vangara Srinivas S/o Narsaiah, Age: 51 years, Occ: Business, R/o H. No., Sarvepally Radhakrishna Street Road, Mahabubabad Town and District
17. Emmadi Chandra Prakash S/o Late Venkateshwarlu, Age: 49 years, Occ: Business, R/o H. No. 3-1-1, Near Municipal office, Mahabubabad Town and District
18. K. Ramesh S/o. , Age: 38 years, Occ: Government Teacher, C/o Duggondi High School, Warangal Rural District

NOTICE

Please take notice that the above named petitioner has filed the above I.P. No.06 of 2018 against all of you to declare him as Insolvent and to discharge petitioner from the dues (Liabilities) and the same is posted to 16.07.2024 for your appearance. There by you are directed by the said court to appear before the Hon'ble Court on 16.07.2024 at about 10.30 AM either in person or through an advocate for counter and objections if any, failing which the matter will be decided in your absence.

// BY ORDER OF THE COURT//
R.RAGHUNADHA RAO
Advocate
Date:09-07-2024 Mahabubabad
Mahabubabad Mobile:8897974574

నవతెలంగాణ

6

వరంగల్-ములుగు

బుధవారం జూలై 10, 2024 www.navatelangana.com

అర్హులైన పేదలకు గృహజ్యోతి పథకం అందేలా చూడాలి



నవతెలంగాణ-చెన్నారావుపేట

అధికారుల తప్పిదం వల్ల గృహజ్యోతి పథకం వర్తించక విద్యుత్ బిల్లు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందని బాధితులు వాపోతున్నారు. మండల కేంద్రంలోని చెన్నారావుపేట గ్రామానికి చెందిన గుర్రం రవీందర్ ప్రజాపాలనలో గృహ జ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. ఆపరేటర్ పొరపాటు వల్ల గృహజ్యోతి పథకానికి తాను అర్హుడిని కాలేకపోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల వద్దకు వెళ్ళి ప్రశ్నించగా ఎన్నికల కోడ్ ఉన్నందున కొద్ది రోజుల సమయం పడుతుందని తెలపడం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ గృహ జ్యోతి పథకం తనకు వర్తింపు కావడం లేదని బాధితుడు. వాపోయాడు, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అర్హులైన తమకు గృహ జ్యోతి పథకం వర్తించేలా చూడాలన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు అర్హులకు అందేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నల్ల ట్యాప్‌ల చోరీ..

నవతెలంగాణ-చెన్నారావుపేట

మండల పరిధిలోని కోనాపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసినటువంటి నల్ల ట్యాప్‌లు చోరీకి గురవుతున్నాయని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ తెలిపారు. కొన్ని రోజుల క్రితం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కూడా నల్ల ట్యాప్‌లు చోరీ చేసినట్లు పాఠశాల హెచ్ఎం రవీందర్ తెలిపారు. పాఠశాల చైర్మన్ ఎర్ర మమత స్పందిస్తూ ప్రభుత్వ పాఠశాలలో ఎటువంటి వస్తువులు చోరీకి గురైన తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని, వారికి కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ దుస్తులు పంపిణీ..

నవతెలంగాణ-పర్వతగిరి



వర్ధన్నపేట మండలం లోని దమ్మన్నపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జననీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎన్ఆర్ఐ డాక్టర్ రోహిత్ మనోజ్ ఆధ్వర్యంలో ఆట దుస్తులు, నోటు పుస్తకాలు, అట్టలు (ప్యాడ్స్) పంపిణీ చేశారు.తరగతుల వారీగా ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు గత తొమ్మిది సంవత్సరాలుగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, ఇకముందు కూడా మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బంధ రమేష్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితుడికి ఇన్సూరెన్స్ అందజేత..

నవతెలంగాణ-చెన్నారావుపేట

మండల పరిధిలోని సూర్యాపేట గ్రామానికి చెందిన ధరావత్ శ్రీను గత నెల రోజుల క్రితం ఖాదర్ పేట పోస్ట్ ఆఫీస్ నందు రూ.399 తో ఇన్సూరెన్స్ ఖాతా ఓపెన్ చేశారు. కొద్దిరోజుల క్రితం ప్రమాదవశాత్తు చెట్టుపైనుండి కాలు జారి కింద పడిపోవడంతో తీవ్ర గాయాలు కాగా ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు నుండి ఇన్సూరెన్స్ రూ. 41713 మంగళవారం ఖాదర్ పేట పోస్ట్ ఆఫీస్ సూర్యాపేట తండాలో బాధితుడికి ఐపిపిబి మేనేజర్స్ సునీత, సంపత్ , సబ్ డివిజన్ పోస్టల్ ఇన్స్పెక్టర్ సుచందర్, చెన్నారావుపేట సబ్ పోస్ట్ మాస్టర్ పర్ష రాజుకుమార్, చెన్నారావుపేట పోస్టల్ సిబ్బంది గుగులోత్ సుమన్, పల్లకొండ క్రాంతి కిరణ్ చేతుల మీదుగా బాధితుడికి నగదును అందజేశారు. ఈకార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీత్లా పండుగ వేడుకలు

నవతెలంగాణ-పర్వతగిరి



గిరిజనులు అత్యంత వైభవంగా జరుపునే సీత్లా పండుగ వేడుకలను మండలం లోని పెద్దతండా గ్రామ పంచాయతీ పరిధి లో మంగళవారం ఘనంగా నిర్వహి ంచారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ కమల, నాయకులు భిక్ష నాయక్ మాజీ సర్పంచ్ గణేష్, రోప్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు. వర్ధన్నపేట లో మండల కేంద్రం లోని భవాని కుంటతండాలో మంగళవారం గిరిజనులు సీత్లా పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

గిరిజన తండాల్లో..



నెక్కొండ:

గిరిజన తండాల్లో మహిళలు ఆరాధ్య దైవంగా కొలిచే సీత్లా భవాని పండుగ వేడుకలను మంగళవారం నెక్కొండ మండలంలో వైభవంగా నిర్వహించుకున్నారు. మహబూబ్ నాయక్ తండ గ్రామపంచాయతీ లో ఘనంగా సీత్లాభవాని పండుగను మహిళలు ఉత్సాహంగా ఆటపాటలతో వేడుకలను నిర్వహించుకున్నారు. మండలంలోని లావుడ్యా వాగ్యానాయక్ తండాలో జెడ్పిటిసి సరోజనహరి కిషన్, ఎంపీపీ రమేష్ నాయక్‌తో పాటు మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గిరిజన మహిళలు పెద్ద ఎత్తున వేడుకల్లో పాల్గొని ఉత్సాహంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో భూక్యా నరేష్, బాలు, ఏరియా, ప్రమీల ,విజయ గిరిజన మహిళలు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని విద్యార్థి మృతి

నవతెలంగాణ-గోవిందరావుపేట

మండలంలోని పస్రా గ్రామానికి చెందిన ఎస్.కె సద్దాం హుస్సేన్(22) ఉరి వేసుకుని మృతి చెందినట్లు పస్రా పోలీసులు తెలిపారు. మంగళవారం పస్రా పోలీసులు అందించిన సమాచారం ప్రకారం ఎస్కే ఉమర్,-ఎస్కే ఆషా ల కుమారుడైన సద్దాం హుస్సేన్ డిగ్రీ చదువుతున్నాడు. గత కొంతకాలంగా ఖాళీగా ఉండడంతో ఏదైనా పనిచేయాలని తల్లిదండ్రులు మందలించారు. సోమవారం తండ్రి ఎస్కే ఉమర్ భద్రాచలం వెళ్ళగా తల్లి ఆశానురూ. లక్ష కావాలని కోరగా ఊరు నుండి తండ్రి వచ్చాక మాట్లాడుదామనిచెప్పింది. సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో భోజనం చేసి పడుకున్న తర్వాత ఉరి వేసుకుని మృతి చెందడం జరిగిందని తెలిపారు. మృతుని తల్లి ఆషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయడం జరిగిందని, పోస్టుమార్టం నిమిత్తం డెడ్ బాడీని ములుగు సామాజిక ఆస్పత్రికి తరలించడం జరిగిందన్నారు.

అప్రమత్తంగా వ్యవహరించాలి: తాహశీల్దార్

నవతెలంగాణ-మంగపేట:

మండలంలోని ముంపు ప్రాంతాల ప్రజలకు వరదల సమయంలో సేవలు అందించడం లో అధికారులు ఇతర సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని తహసీల్దార్ బైరి వీరస్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వీరస్వామి మాట్లాడుతూ అధికారులు వరదలు సంభవిస్తే ఎదుర్కొనేందుకు అన్ని రకాలుగా సంసిద్ధం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కృష్ణ ప్రసాద్, వైద్యులు చిన్నపాక యమున, నిఖిల్ పాల్గొన్నారు.

బొగత వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి

నవతెలంగాణ-వాజేడు :

తెలంగాణ నయాగార బొగత జలపాతాన్ని వెంకటాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ బండారి కుమార్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా జలపాత సందర్శకులు లోతట్టు ప్రాంతాలకు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

గోదావరి వరదలపై అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-వాజేడు:

రాబోయే గోదావరి వరద ప్రభావిత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా వుండాలని వాజేడు ఎస్సై హరీష్‌రుద్ర సూచించారు. మంగళవారం మండలం లో వరద ముంపు ప్రభావిత గ్రామలైన సుందర్యకాలనీ, దూలపురం గ్రామాలను సందర్శించి, ఆకస్మికంగా వచ్చే వరదల పట్ల తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సివిల్ పోలీసులు, స్పెషల్ పార్టీ జవాన్లు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు బయ్యక్కపేట రైతుల వినతి



నవతెలంగాణ -తాడ్వాయి

మండలంలోని బయ్యక్కపేట గ్రామానికి తక్కలపాడు స్కూలు ప్రారంభోత్సవానికి వచ్చిన పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు బయ్యక్కపేట రైతులు ఫారెస్ట్ అధికారులు మా భూమిని వ్యవసాయం చేయ్యనీయకుండా ఇబ్బంది పెడుతున్నారని, మా భూములు మాకు పట్టాలి ఇప్పించాలని వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ గతంలో ఎప్పటినుండో బయ్యక్కపేటలోని సర్వేనెంబర్ 126 భూములను సాగు చేసుకుంటున్నామని, 1940 నుండి పట్టాలు ఉన్నాయని అన్నారు. గత ప్రభుత్వం ఆ పట్టాలను అసైన్డ్ పట్టాలను మార్చారని, అరెస్టులు మమ్ములను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. మంత్రి సీతక్క గతంలో ప్రచారానికి వచ్చినప్పుడు ఈ సమస్యను గుర్తు చేసినట్లు, తాము గెలిచినాక మీ సమస్యను పరిష్కరిస్తా అన్నట్లు రైతులు గుర్తు చేశారు. మంత్రి సీతక్క సానుకూలంగా స్పం దించారు. తమ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రేగోరి వేణుగోపాల్ రెడ్డి, గోలి సంతోష్, కంది లింగయ్య సతీష్, 166 సర్వే నెంబర్ గల 70 మంది రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు







విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ -తాడ్వాయి

రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పుట్టినరోజు సందర్భంగా మంగళవారం మండలంలోని కామారం(పీటి) ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు నోటు పుస్తకాలు బుక్కులు, పెన్నులు, ప్యాడ్లు, పెన్సిల్ లు, రబ్బర్లు ఇతర సామాగ్రి అందజేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీతక్క అభిమానులు, గ్రామస్తులతో కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. సీతక్క జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు రేగా కళ్యాణి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆడబిడ్డ, ములుగు అభివృద్ధి ప్రదాత, కష్టాల్లో ఉన్న పేదవారికి నేనున్నా అని అండగా నిలబడే మన అక్కకి జన్మదిన శుభాకాంక్షలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు కోర్నేబెల్లి సావిత్రి, మాజీ ఎంపిటిసి కవిత, కామారం కాంగ్రెస్ పార్టీ గ్రామపంచాయతీలు రేగా అనిల్ కుమార్, ఆనంద్, శశికాంత్, సందీప్, స్వాతి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, సీతక్క అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి:

పంచాయతీరాజ్ గ్రామీణాభివద్ధి, స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క పుట్టినరోజు సందర్భంగా మంగళవారం బీరెల్లి లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీరెల్లి మాజీ సర్పంచ్ బెజ్జూరి శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షులు మొక్కటి కోటి, ఎంపీటీసీ ఇరుసోడ్ల భవాని నారాయణ, సీనియర్ నాయకులు దాయ వెంకటేశ్వర్లు(కోడి), అల్లెం సాంబశివరావు, కాలేశ్వరం వీరాచారి, జాజ శివ, వంగరి సదానందం, సురేష్, వంగరి రమేష్, బాసాని అనిల్, గోసంగి స్వామి, తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గోవిందరావుపేట:

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు ధనసరి సీతక్క 52వ పుట్టినరోజు వేడుకలను మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు పాలడుగు వెంకట కృష్ణ నేతత్వంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోనీ బస్టాండ్ ఆవరణ వద్ద గల ఇందిరా గాంధీ విగ్రహం ప్రాంతంలో పస్రా చలువాయి గ్రామాలలో 163వ జాతీయ రహదారి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు సీతక్క అభిమానులు విస్తృతంగా బర్త్‌డే ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో సుమారు 30 అడుగుల పైబడి కటౌట్ ను జాతీయ రహదారి వెంట రాఘవపట్నం పెట్రోల్ బంక్ క్రాస్ లో నిర్మించారు. పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేసి కార్యకర్తలు ప్రజాప్రతినిధులు మహిళ మణులు పంచుకున్నారు.. ఈ కార్యక్రమంలో గోవిందరావుపేట మండల రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంగపేట:

పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి సీతక్క పుట్టినరోజు ను పురస్కరించుకొని మండల వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఆమె జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని బిక్షంపేట గ్రామంలో మాజీ సర్పంచ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పగిడిపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బిక్షంపేట గ్రామంలోని గ్రామపంచాయతీ వద్ద పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం గ్రామంలోని కూడలల్లో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కాటూరి నాగయ్య ప్రధాన కార్యదర్శి రాచకొండ సోమయ్య, పల్లె శోభన్ బాబు మాజీ ఉప సర్పంచ్ సీనియర్ నాయకులు గడ్డం పరమేష్, బొడ్డు ఎంకన్న ధర్మారం సాయిలు, మండల ప్రధాన కార్యదర్శి ఏంపెల్లి సమ్మయ్య, యూత్ అధ్యక్షులు చెప్పు నాగలి, పరశు రాము, పూజారి ఏకాంతం, సోమ శ్రీనివాస్ రెడ్డి, నక్క శ్రీనివాస్, పన్నాల సత్తిరెడ్డి, కుంట్ల ఎడ్ల నాగయ్య, స మ్మిరెడ్డి వీరారెడ, మహిళలు సామ సరోజన, మామిడి ఎల్లమ్మ, సోమ కమలమ్మలు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు ఎడ్ల బండి బహుకరణ

మంగపేట:

రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క జన్మదినం సందర్భంగా జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ డైరెక్టర్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నాసిరెడ్డి సాంబశివరెడ్డి మంగళవారం సీతక్కకు ఎద్దుల బండిని బహుకరించి సీతక్క పై తన అభిమానాన్ని చాటుకున్నారు. మంగళవారం ములుగు పట్టణంలో జరిగిన సీతక్క జన్మదిన వేడుకలకు హాజరైన సాంబశివరెడ్డి ప్రత్యేకంగా తయారు చేయించి తెప్పించిన ఎద్దుల బండిని బహుకరించి మంత్రి సీతక్కకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపినట్లు తెలిపారు. సీతక్క జన్మదినాన్ని పురస్కరించుకుని వికాస్ అగ్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని అకినేపల్లి మల్లారం గ్రామంలో సుమారు రూ.25 వేల ఇరువై ఐదు వేల విలువైన ఎరువులను రైతులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు వెల్లడించాడు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న, మంగపేట కాంగ్రెస్ అధ్యక్షుడు, మైలా జయరాం రెడ్డి, వికాస్ అగ్రి ఫౌండేషన్ ప్రతినిధులు పచ్చిపులుసు నరేష్, తిరుపతిరావు, ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు పొనుగోటి చంద్రావు, కట్టం సాయి, పసుపులేటి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో విద్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క



నవతెలంగాణ -తాడ్వాయి

ములుగు జిల్లా తాడ్వాయి మండలం బయ్యక్కపేట అటవీ సమీపంలో గల తక్కల పహాడ్ కు చెందిన పాయం తులసీ అనే విద్యార్థిని జీతెలుగు డ్రామా జూని యర్స్ ప్రోగ్రాంకి సెలక్ట్ అయ్యింది. గొత్తికోయ బాలిక కావడంతో ఆ కార్యక్రమానికి జీ సంస్థ ముఖ్య అతిథిగా మంత్రి సీతక్కను ఆహ్వానించారు. ప్రోగ్రాంలో తన కళను ప్రదర్శించిన తులసిని అభినందించిన సీతక్క తన వివరాలను తెలుసుకుని ఏం కావాలి పాప నీకు అని మంత్రి అడిగిన మాటకు తమ గూడెంలో చదువుకోవటానికి బడి లేదు ఓ బడి కట్టించండి అని కోరింది తులసీ. గిరిజన బాలిక కోరికకు చలించిన మంత్రి ఈ విధులను జిల్లా ఎస్పీ శబరిష్ కు బాధ్యతలు అప్పగించారు. జిల్లా ఎస్పీ శబరిస్ కిందిస్థాయి పోలీస్ అధికారుల ఫారెస్ట్ అధికారుల సహకారంతో 15 రోజుల్లోనే పాఠశాల భవనాన్ని నిర్మించారు. అటవీ ప్రాంత మైనప్పటికిని సం బంధిత అధికారుల సహాయంతో కార్పోరేట్ స్థాయిలో విద్యాలయం నిర్మించారు. తక్కువ సమయంలో పనులు పూర్తి చేసిన జిల్లా పోలీస్ యంత్రాంగానికి జిల్లా ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సీతక్క పుట్టిన రోజు సందర్భంగా విద్యాలయాన్ని జిల్లా ఎస్పీ శబరీష్ తో కలిసి ప్రారంభించారు. 30 మంది విద్యార్థులు ఉన్న ఆ గూడెంలో పాఠశాల ప్రారంభించడంతో తమ పిల్లలకు భవిష్యత్తు బాగు పడుతుందని గూడెం వాసులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా సీతక్క తన చదువు రోజులను, గిరిజనుల చదువు ఇబ్బందులను వారితో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా ఎస్పీ శబరిస్, డీఎస్పీ రవీందర్, పస్రా సీఐ రవీందర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, దాతా తరుణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాకులమర్రి ప్రదీప్ రావు, మండల అధ్యక్షులు బొల్లు దేవేందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు రేగ కళ్యాణి, మాజీ ఎంపీపీ ఎనిగంటి రామయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే మొట్టమొదటి.. కంటైనర్ ఆస్పత్రి..

ములుగు జిల్లా బంధాల ఏజెన్సీలో ప్రారంభం

నవతెలంగాణ -తాడ్వాయి



జిల్లా కలెక్టర్ కృషితో తెలంగాణ రాష్ట్రంలోనే తొలిసారిగా ఓ వినూత్న ప్రయోగం ములుగు జిల్లాలో ఆవిష్కృతమైంది. అత్యవసర వైద్యం అందించేందుకు సరికొత్త సాంకేతికతతో ఏర్పాటు చేసిన ప్రీ ఫ్యాబ్రికేటెడ్ సబ్ సెంటర్(కంటైనర్ ఆస్పత్రి)ని.. దట్టమైన మారుమూల ఏజెన్సీ గ్రామం, రోడ్డు రవాణా సరిగ్గా లేని తాడ్వాయి మండలం బంధాల గ్రామపంచాయతీ పరిధి పోచాపూర్‌లో ఈ కంటైనర్‌ను ఏర్పాటు చేశారు. ఏటా వర్షాకాలంలో బంధాల ఏజెన్సీ ప్రాంతంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో సరైన సమయంలో వైద్యం అందక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు అంతేకాదు, రవాణా సౌకర్యం లేక వైద్య సిబ్బంది మారుమూల గ్రామాల్లోని గిరిజన ప్రాంతాలకు వెళ్లి వైద్యం అందించడానికి కష్టంగా మారింది. ఇలాంటి పరిస్థితులను అధిగమించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ-శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఓ వినూత్న ప్రయోగం చేశారు. జాతీయ రహదారికి సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న పోచాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో అల్లిగూడెం, బొల్లెపల్లి, బంధాల, నర్సాపూర్(పీఎల్) ఆదివాసీ గ్రామాలున్నాయి. వీరికి వర్షాకాలంలో రహదారి సరిగా లేక వైద్యం పొందలేక ప్రాణాలు కోల్పోతుంటారు. దీనిని అధిగమించేందుకు ఏజెన్సీలో వైద్యం అందించేందుకు ఈ కంటైనర్ ఏర్పాటు చేశారు. నాలుగు పడకలు, సేవలందించే నర్సు, వైద్యులకు ప్రత్యేక గది ఉన్న కంటైనర్.. సుమారు రూ.7లక్షలతో దీన్ని రూపొందించారు. 3 రోజుల క్రితం ప్రత్యేక వాహనంలో హైదరాబాద్ నుంచి పోచాపూర్‌కు మండల ప్రత్యేక అధికారి అల్లెం అప్పయ్య, స్థానిక తహసీల్దార్ రవీందర్, పంచాయతీ కార్యదర్శి రమేష్ ఏర్పాటు చేశారు.

స్వల్పకాలిక వరి పంటను మాత్రమే సాగు చేయాలి

నవతెలంగాణ-నర్సంపేట



వర్షాలు ఆశించిన తీరులో కురవక దీర్ఘకాలిక వరి సాగుకు ఆచరణ యోగ్యంగా లేనందున స్వల్పకాలిక రకాల విత్తనాలతో మాత్రమే సాగుకు సిద్ధం కావాలని ఏడీఏ కేసరి నగేష్ అన్నారు. మంగళవారం ఏడీఏ నగేష్ మాట్లాడుతూ వానకాలంలో ఇప్పటి వరకు కురిసిన వర్షాలు కేవలం మొక్కజొన్నలు, పత్తి పంటల సాగుకు మాత్రమే అనుకూలించాయన్నారు. ప్రధమంగా కావాల్సింది ఆహార వరి పంట అయినందున రైతులు స్వల్పకాలిక పంటను ఎంచుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. నర్సంపేట వ్యవసాయ డివిజన్ పరిధిలో ప్రస్తుత వాతవరణ పరిస్థితులను అనుసరించి 120 నుంచి 125 రోజు స్వల్పకాలిక పంటకు రైతులు సిద్ధం కావాలన్నారు.ప్రస్తుత వరి సాగుకు తెలంగాణ సోన (ఆర్ఎన్ఆర్-15048) 125 రోజుల పంట కాలంలో 26-28 క్వింటాల దిగుబడి సామర్థ్యం కలిగి ఉంటుందని తెలిపారు. వరంగల్ వరి (వరంగల్-1119) పంట కాలం-115-120, 28 క్వింటాలు, కలవరం-వరి-2, కేఎన్ఎం-1638), 12-125 రోజుల పంట కాలం, 30 నుంచి 34 క్వింటాలు, వరంగల్ వరి-962) పంటకాలం 120 నుంచి 125 రోజులు, దిగుబడి 26 నుంచి 30 క్వింటాలు, జగిత్యాల సాంబ(జేజీఎల్-3844) పంట కాలం 120 నుంచి 125 రోజులు, దిగుబడి 26 నుంచ 28 క్వింటాలు, జగిత్యాల సన్నాలు(జేజీఎల్ 1798) 125 పంట కాలం, దిగుబడి 20 నుంచి 25 రోజులు, ఎర్ర మల్లెలు(వరంగల్ 20471) పంట కాలం 125 రోజులు, దిగుబడి 20 నుంచి 22 క్వింటాలు, కువరం వరి1(కేఎన్ఎం-733) పంట కాలం 120 రోజులు, 29 నుంచి 33 క్వింటాల దిగుబడి సాధించవచ్చని ఏడీఏ వివరించారు. పైన తెలుపబడిన వరి రకాలు మన ప్రాంతానికి అనుకూలమైన సన్న రకం వరి పంటకు అనుకూలంగా జూలై 20వ తేది వరకు నారు చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు. రైతులు ప్రస్తుత వాతవరణ పరిస్థితులు దృష్టిలో ఉంచుకొని తగిన రకాలను ఎంచుకొని సాగు చేసి దిగుబడులను సాధించుకోవాలని సూచించారు.

బాధిత కుటుంబానికి నాయకుల పరామర్శ

నవతెలంగాణ- పర్వతగిరి

మండలం లోని గోరు గుట్ట తండా లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త భూక్య వీరన్న తండ్రి అనారోగ్యంతో మరణించగా మంగళవారం మృతుని కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు వాగ్య నాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షులు భాస్కర్ నాయక్, సీనియర్ నాయకులు జంగిలి సమ్మయ్య, తండా గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నేడు మండలంలో మంత్రి సీతక్క పర్యటన

నవతెలంగాణ-గోవిందరావుపేట



నేడు(బుధవారం) మండలంలో మంత్రి సీతక్క విస్తృతంగా పర్యటించనున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో వెంకటకృష్ణ మాట్లాడుతూ బుధవారం ఉదయం 10:00 గంటలకు మండలం లోని చల్వాయి గ్రామంలోని కస్తూర్బా గాంధీ స్కూల్ నందు ప్రారంభోత్సవ కార్యక్రమం, అలాగే 10:30 గంటలకు ప్రూట్పారం రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి దనసరి సీతక్క విచ్చేయుచున్నారు. కావున మండలంలోని రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు, మహిళా నాయకురాళ్ళు, కార్యకర్తలు , అభిమానులు అందరూ పెద్ద సంఖ్యలో హాజరయి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

డెంగ్యూ, మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి



నవతెలంగాణ- ములుగు

ములుగు జిల్లాని డెంగ్యూ, మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దే క్రమంలో మంగళవారం పాలంపేట గ్రామాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి పోరిక రవీందర్ సందర్శించారు. ఈసందర్భంగా .దోమలు కుట్టే ప్రదేశాలను ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరు పరిశుభ్రమైన నీరు,వేడి ఆహారం తీసుకోవాలని టైర్లు, కొబ్బరి బోండాలు, గోళాలు, సీసాల్లో వర్షపు నీరు నిల్వ ఉంచరాదని తెలిపారు. అదేవిధంగా ఫుల్ హ్యాండ్స్ దుస్తులు ధరించాలని, దోమ తెరలను చాపలు పట్టడానికి కాకుండా, ఇంటిలో దోమల బారి నుండి రక్షణకు ఉపయోగించాలని సూచించారు. అనంతరం వెంకటాపూర్ పీహెచ్‌సీని సందర్శించి ఈ సీజన్లో వచ్చే వ్యాధుల గురించి ప్రజల్లో ఆరోగ్య సూత్రాల అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు.

నేటి ప్రజాసంఘాల ధర్నాను విజయవంతం చేయాలి: సీఐటీయూ



నవతెలంగాణ-ఏటూరు నాగారం ఐటీడీఏ

మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ముందు నేడు(బుధవారం) జరిగే ప్రజాసంఘాల ధర్నాలో అందరు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావూద్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు బాలోజు రమేష్ అధ్యక్షతన మంగళవారం ముఖ్య సమావేశం జరిగింది. సందర్భంగా హాజరైన దావూద్ మాట్లాడుతూ కార్మిక హక్కులను కాపాడేందుకు దేశవ్యాప్తంగా చేపట్టిన కార్మిక పోరాటాలను ఉధృతం చేయాలని దావూద్ పిలుపునిచ్చారు. ఆశాలు, అంగన్‌వాడీలు, హమాలీలు భవననిర్మాణ కార్మికులు బీడీ కార్మికులు ఆయా రంగాల్లో పనిచేస్తున్న కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సరుకుల సరఫరాలో రాజీపడొద్దు: ఏపీవో

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ



గురుకులాల్లోని కళాశాలలు, పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు భోజన సరుకులను సరఫరా చేసే విషయంలో నాణ్యతలో ఎలాంటి రాజీపడొద్దని ఐటీడీఏ ఏపీఓ వసంతరావు అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో గతంలో నిర్వహించిన టెండర్లను మంగళవారం మండల కేంద్రంలోని ఐటీడీఏలో ఓపెన్ చేశారు. మటన్, చికెన్, కోడిగుడ్లు, కూరగాయలు సరఫరా చేసేందుకు సేలర్స్ 299 మంది డీడీలు కట్టి టెండర్లు వేశారని ఏపీఓ తెలిపారు. ఇందులో తక్కువ కోడ్ చేసిన వారికి ఏజెన్సీని అప్పగిస్తామన్నారు. గత ఏడాది రూ. 18లకు కిలో ఇచ్చిన కూరగాయలు ఈ ఏడాది రూ. 14లకు ఇస్తున్నట్లు తెలిపారు. మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి 26 కళాశాల, పాఠశాలలున్నాయన్నారు. ఇందులో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రభుత్వం కేటాయించిన మెనూ ప్రకారం భోజనం వడ్డించాల్సి ఉందన్నారు. ఇందుకు గాను టెండర్ల ద్వారా ఏజెన్సీలకు కాంట్రాక్టును అప్పగించి ఈ ఏడాది విద్యాసంవత్సరం పూర్తి అయ్యే వరకు అగ్రిమెంట్‌లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎవరైనా నాసిరకమైన సరుకులు, ఆహార వస్తువులు సరఫరా చేస్తే వెంటనే కాంట్రాక్టును రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఆర్‌సీఓ రాజ్యలక్ష్మి, డీడీ పోచం, ఎస్ఓ రాజ్‌కుమార్, హెచ్‌డబ్ల్యూఓలు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-గోవిందరావుపేట

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కిసాన్ మోర్చ మండల అధ్యక్షుడు బొమ్మెర బోయిన వీర భిక్షం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు భారతీయ కిసాన్ మోర్చా రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు బిజెపి మండల అధ్యక్షులు మద్దినేని తేజ రాజు ఆధ్వర్యంలో మండల కిసాన్ మోర్చా సభ్యులతో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్దార్ సృజన్ కుమార్ కు అందించారు. తహసీల్దార్ సృజన్ కుమార్ మాట్లాడుతూ డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా కృషి చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రచార కార్యదర్శి రుద్రారం సురేష్, మూల కుమార్ మండల కార్యదర్శి, కందాల రవీందర్ రెడ్డి మండల ఉపాధ్యక్షులు, కుమ్మరి కుంట్ల సదానందం, బొల్లంపల్లి మురళి, కుసుమ కిషోర్, అంకిరెడ్డి సత్యానారాయణరెడ్డి, బెల్లి లింగయ్య మూల రంగారెడ్డి, తుక్కని మధుకర్ రెడ్డి, కర్ణగంటి శ్రీకాంత్, వాసం స్వామి, మారబోయిన శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.